PRGI Regd. No : APTEL/26/A0819

నేటిపత్రిక

# ప్రజాసీమ

జాతీయ తెలుగుదినపత్రిక

విలేకరులు కావలెను.

నిజాన్ని నిర్భయంగా ప్రచురిస్తూ
పత్రికా రంగంలో కొత్త ఒరవడిని సృష్టిస్తున్న
నేటి దినపత్రిక ప్రజాసీమ పత్రికలో పనిచేసేందుకు
నియోజకవర్గ ఇన్‌చార్జులు,
మండల విలేకరులు కావలెను

సంప్రదించవలసిన నెంబర్లు
8074596109, 9676747256

ప్రచురణ : వైయస్ఆర్ కడప జిల్లా | సంపుటి : 01 | సంచిక: 172 | 26 శనివారం సెప్టెంబర్ 2026 | పేజీలు : 08 | వెల: 02

Circulated At YSR Kadapa, Annamayya, Vijayawada, Tirupathi, Chittor, Kurnool, Nandyal, Ananthapur, Puttaparthi, SPSR Nellore, VIshakapatnam, East Godavari, West Godavari

## స్టాలిన్ గారూ, ఈ కేసుపై నోరు విప్పండి

# సీఎం విజయ్ ఆగ్రహం

- వీరమణి లైంగిక వేధింపుల కేసుపై నోరు విప్పాలన్న విజయ్
- డీఎంకే హయాంలోనే కేసును తొక్కిపెట్టారని తీవ్ర ఆరోపణలు
- ఈ విషయంలో డీఎంకే, ఏఐఏడీఎంకే కుమ్మక్కయ్యాయని విమర్శ
- ఉప ఎన్నికల ప్రచారంలో స్టాలిన్ ప్రభుత్వాన్ని టార్గెట్ చేసిన సీఎం విజయ్



తమిళనాడు రాజకీయాలు మరోసారి రసవత్తరంగా మారాయి. ప్రముఖ గ్రానైట్ వ్యాపారి ఆర్. వీరమణిపై నమోదైన లైంగిక వేధింపుల కేసు విషయంలో ముఖ్యమంత్రి విజయ్, డీఎంకే అధినేత ఎం.కే. స్టాలిన్‌పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. “స్టాలిన్ గారూ, ఈ ఉదంతంపై మీ మౌనాన్ని వీడండి” అంటూ డిమాండ్ చేశారు. అక్టోబర్ 6న జరగనున్న ఉప ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న విజయ్, డీఎంకే ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. “2025 అక్టోబర్‌లో, డీఎంకే హయాంలోనే ఈ కేసుకు సంబంధించి ఫిర్యాదు అందిన ప్పటికీ, వారు నిందితులను రక్షించేందుకు వాస్తవాలను తారుమారు చేశారు. తగిన ఆధారాలు లేవనే సాకుతో కేసును మూసివేశారు” అని విజయ్ ఆరోపించారు. ఈ వ్యవహారంలో డీఎంకే, ఏఐఏడీఎంకే పరస్పరం సహకరించుకున్నాయని, అందుకే ఆ రెండు పార్టీలు నోరు మెదపడం లేదని విమర్శించారు. తన తల్లిని విమర్శించినా సహిస్తానని, కానీ తమిళనాడులోని మహిళా లోకాన్ని అవమానిస్తే ఊరుకోనని స్పష్టం చేశారు. డీఎంకే శ్రేణులు, వారి కుటుంబ సభ్యులు ఇటువంటి అనైతిక చర్యలను ప్రోత్సహిస్తున్నారని ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు.మైనర్ బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఆరోపణలతో జెమ్ గ్రానైట్స్ చైర్మన్ ఆర్. వీరమణితో పాటు, ఆయనకు సహకరించిన శాంతి, మహేంద్ర సింహన్‌లను 2026 ఆగస్టులో పోలీసులు అరెస్టు చేశారు. 2025లో ఓ సామాజిక కార్యకర్త విడుదల చేసిన వీడియో ఫుటేజ్‌తో ఈ ఉదంతం వెలుగులోకి వచ్చిన సంగతి తెలిసిందే. అయితే, ప్రస్తుత టీవీకే ప్రభుత్వ హయాంలో ప్రత్యేక పోక్సో కోర్టు గతంలోని క్లోజర్ రిపోర్ట్‌ను తిరస్కరించి, పునర్విచారణకు ఆదేశించింది.



# నారా లోకేశ్ బిజీబిజీ...

## టోరెంట్, వెల్ స్పన్, ఆస్ట్రల్.. అహ్మదాబాద్‌లో రెండో రోజు కూడా

- అహ్మదాబాద్ పర్యటనలో పారిశ్రామిక దిగ్గజాలతో మంత్రి లోకేశ్ వరుస సమావేశాలు
- క్లీన్ ఎనర్జీ ప్రాజెక్టుల కోసం ఏపీని ఎంచుకోవాలని టోరెంట్ గ్రూప్‌కు పిలుపు
- విశాఖలో టైర్ల తయారీ, డేటా సెంటర్ల ఏర్పాటుపై పలు సంస్థలతో కీలక చర్చలు
- కాకినాడ, నెల్లూరులలో ఇండస్ట్రియల్ పార్కులు, రిఫైనరీలు స్థాపించాలని విజ్ఞప్తి
- లోకేశ్ ప్రతిపాదనలను పరిశీలిస్తామని సానుకూలంగా స్పందించిన కంపెనీలు

ఏపీకి పెట్టుబడులే లక్ష్యంగా ఏపీ ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ విస్తృత పర్యటనలు కొనసాగిస్తున్నారు. గుజరాత్ లోని అహ్మదాబాద్ టూర్‌లో భాగంగా రెండో రోజైన శుక్రవారం ఆయన పలు పారిశ్రామిక దిగ్గజాలతో సమావేశమయ్యారు. రాష్ట్రానికి భారీ పెట్టుబడులను ఆకర్షించడమే ధ్యేయంగా ఏడు ప్రముఖ సంస్థల అధిపతులు, ప్రతినిధులతో చర్చలు జరిపారు.

...మిగతా 2 లో...

## దీన్‌దయాళ్ ఆలోచనలే వికసిత్

# భారత్‌కు దిక్సూచి...



**దీన్‌దయాళ్ జయంతి సందర్భంగా మోదీ నివాళి**
**వ్యక్తి ప్రగతి సమాజ హితంతో ముడిపడి ఉండాలన్నదే దీన్‌దయాళ్ సిద్ధాంతమని వెల్లడి**
**అభివృద్ధి ఫలాలు అందరికీ అందాలనేదే అంత్యోదయ లక్ష్యమని వ్యాఖ్య**

స్వదేశీ భావజాలంతో దేశాభివృద్ధికి ప్రత్యేక దృక్పథాన్ని అందించిన మహనీయుడు పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ అని ప్రధాని మోదీ కొనియాడారు. ఆయన ప్రతిపాదించిన ఏకాత్మ మానవతావాదం, అంత్యోదయ స్ఫూర్తే బీజేపీకి, తమ ప్రభుత్వాల నిర్ణయాలకు మార్గదర్శకమని పేర్కొన్నారు. వ్యక్తి ప్రగతి సమాజం నుంచి వేరుగా కాకుండా, సమాజ హితంతో ముడిపడి ఉండాలన్నదే దీన్‌దయాళ్ సిద్ధాంత సారమని చెప్పారు. ప్రకృతిని దెబ్బతీయకుండా సమాజం పురోగమించేలా అభివృద్ధి నమూనా ఉండాలని ఆయన ఆలోచనలు చెబుతాయని వ్యాఖ్యలు చేశారు.అభివృద్ధి ఫలాలు సమాజంలోని చివరి వ్యక్తి వరకు చేరడమే అంత్యోదయ లక్ష్యమని మోదీ గుర్తుచేశారు. ఏకాత్మ మానవతావాదాన్ని వివరిస్తూ, వ్యక్తి ఎదుగుదలతో పాటు సమాజం, ప్రకృతి, దేశం మధ్య సమతుల్యత ఉండాలని దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ప్రతిపాదించారని ప్రధాని పేర్కొన్నారు. కేవలం ఆర్థిక వృద్ధే అభివృద్ధి కాదని, అందులో సామాజిక సంక్షేమం, పర్యావరణ పరిరక్షణ కూడా భాగస్వామ్యం కావాలని ఆయన భావించినట్లు తెలిపారు.పేదల సంక్షేమం, సమాజంలోని అట్టడుగు వర్గాల సాధికారత, పర్యావరణ సమతుల్యతకు ప్రాధాన్యమిస్తూ తమ ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటోందని మోదీ వివరించారు. ఈ ఆలోచనల స్ఫూర్తితోనే సమగ్ర, అభివృద్ధి చెందిన భారతదేశం లక్ష్యంగా ‘వికసిత్ భారత్’ నిర్మాణాన్ని ముందుకు తీసుకెళ్తున్నామని అన్నారు.

## యూపీఐ లావాదేవీలపై చార్జీలు..

### వినియోగదారులకు భారం లేదన్న నిర్మలా సీతారామన్

- ఎండీఆర్ చార్జీలపై వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్న నిర్మల
- ఈ చార్జీలు కేవలం వ్యాపారులకు మాత్రమే పరిమితమని స్పష్టీకరణ
- నిబంధనలపై అవగాహన లోపం వల్లే అపోహలు వ్యాపిస్తున్నాయని వ్యాఖ్య



యూపీఐ డిజిటల్ చెల్లింపులపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) చార్జీలు విధించనున్నారనే ప్రచారంపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టత ఇచ్చారు. ఈ అంశంతో సాధారణ ఖాతాదారులు లేదా వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారి జేబుపై ఎలాంటి అదనపు భారం పడదని తెలిపారు. రూ.2,000కు మించిన కొన్ని నిర్దిష్ట డిజిటల్ లావాదేవీలకు ఎండీఆర్ వర్తించినా, అది వినియోగదారులకు కాదని, వ్యాపారులకే పరిమితమని మంత్రి చెప్పారు. ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ ఆమె ఈ మేరకు స్పష్టతనిచ్చారు.ఎండీఆర్ అనేది కేంద్ర ప్రభుత్వం వసూలు చేసే పన్ను, సెస్ లేదా సర్‌చార్జ్ కాదని... ఆ మొత్తం ప్రభుత్వ ఖజానాకు వెళ్లదని స్పష్టం చేశారు. బ్యాంకులు, పేమెంట్ గేట్‌వేలు వంటి డిజిటల్ చెల్లింపు వ్యవస్థ నిర్వహణకు సంబంధించిన ఖర్చుల కోసం ఈ రుసుము ఉంటుందని వివరించారు. ఎండీఆర్ నిబంధనలపై అవగాహన లోపం వల్లే అనవసర అపోహలు వ్యాపిస్తున్నాయని అన్నారు.

...మిగతా 2 లో...

## రేపటిలోగా సీఈసీ రాజీనామా చేయాల్సిందే.. లేదంటే గాంధీ జయంతి నుంచి దేశవ్యాప్త నిరసనలు: సీజేపీ

- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని సీజేపీ డిమాండ్
- శనివారంలోగా తప్పుకోకపోతే దేశవ్యాప్త ఆందోళనలకు పిలుపు
- అక్టోబర్ 2న ముంబై నుంచి నిరసన కార్యక్రమాలు ప్రారంభిస్తామని ప్రకటన
- ప్రజాస్వామ్యాన్ని సీఈసీ నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపణ
- జ్ఞానేశ్ కుమార్ అతిపెద్ద దేశద్రోహి అంటూ తీవ్ర వ్యాఖ్యలు

ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ తన పదవికి వెంటనే రాజీనామా చేయాలని ‘కాక్రోచ్ జనతా పార్టీ’ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే డిమాండ్ చేశారు.



## సీఎం చంద్రబాబు మదనపల్లి పర్యటనను దిగ్విజయం చేయండి

### - ఎన్.ఎల్.వై.ఎఫ్ జిల్లా అధ్యక్షులు షేక్ లతీఫ్ పిలుపు



**మదనపల్లె (ప్రజా సీమ) :** అక్టోబర్ 2న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నమయ్య జిల్లా కేంద్రమైన మదనపల్లె పర్యటనకు విచ్చేస్తున్నారని నారా లోకేష్ యువజన ఫౌండేషన్ (ఎన్.ఎల్.వై.ఎఫ్) జిల్లా అధ్యక్షుడు షేక్ లతీఫ్ పేర్కొన్నారు.ఈ సందర్భంగా శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్,ఎమ్మెల్యేలతో కలిసి హార్టికల్చర్ హబ్ కి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారన్నారు.ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు అన్నమయ్య జిల్లా అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారని,సీఎం సహకారంతో ఎమ్మెల్యే మహమ్మద్ షాజహాన్ బాషా మదనపల్లి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని కొనియాడారు.హార్టికల్చర్ హబ్ ఏర్పాటయితే జిల్లాలో వ్యవసాయ రంగానికి సరికొత్త ఊతం లభిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.కూటమి పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి,సంక్షేమం పరుగులు పెడుతున్నాయన్నారు.సూపర్ సిక్స్ సంక్షేమ పథకాల అమలుతో ప్రజలు ఆనందంగా జీవిస్తున్నారని కొనియాడారు.కావున కూటమి పార్టీల నేతలు,కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చి ముఖ్యమంత్రి పర్యటనను దిగ్విజయం చేయాలని షేక్ లతీఫ్ పిలుపునిచ్చారు.



# ఏపీలో వర్ష బీభత్సం..

## అధికారులకు మంత్రి అచ్చెన్నాయుడు కీలక ఆదేశాలు

- తీవ్ర వాయుగుండం వల్ల రాష్ట్రంలో పంట నష్టంపై తక్షణ అంచనాకు ఆదేశం
- పునరుద్ధరణ పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని అధికారులకు సూచన
- ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో మంత్రి అచ్చెన్నాయుడు టెలీకాన్ఫరెన్స్
- పొలాల్లోని నీటిని తొలగిస్తూనే, భవిష్యత్తు కోసం నిల్వ చేయాలని దిశానిర్దేశం
- రైతులకు సాంకేతిక సలహాలు అందించి అండగా నిలవాలని స్పష్టం

తీవ్ర వాయుగుండం ప్రభావంతో రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాలు, ఈదురుగాలుల వల్ల జరిగిన పంట నష్టాన్ని తక్షణమే అంచనా వేయాలని అధికారులను ఆదేశించినట్టు ఏపీ వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు.

...మిగతా 2 లో...

ప్రజాసీమ

# ఏపీలో వర్ష బీభత్సం...

మొదటిపేజీ తరువాయి

## అధికారులకు మంత్రి అచ్చెన్నాయుడు కీలక ఆదేశాలు

దెబ్బతిన్న రహదారులు, ఇతర మౌలిక సదుపాయాల పునరుద్ధరణ పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని స్పష్టం చేసినట్టు ఆయన వెల్లడించారు. క్షేత్రస్థాయిలో రైతులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ మేరకు ఆయన ఉన్నతాధికారులతో శుక్రవారం ప్రత్యేక టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బూడితి రాజశేఖర్, ఇతర ఉన్నతాధికారులతో పాటు పార్వతీపురం మన్యం, డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ, శ్రీకాకుళం జిల్లాల కలెక్టర్లతో మాట్లాడారు. వ్యవసాయ, ఉద్యాన పంటలకు జరిగిన నష్టంపై వెంటనే క్షేత్రస్థాయి సర్వే ప్రారంభించి, వివరాల నమోదును వేగవంతం చేయాలని ఆదేశించారు. పొలాల్లో నిలిచిన నీటిని తొలగించడం, అధిక తేమ వల్ల పంటలు దెబ్బతినకుండా రైతులకు అవసరమైన సాంకేతిక సలహాలు అందించి, వారిలో అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజల రాకపోకలకు ఆటంకం కలగకుండా దెబ్బతిన్న ముఖ్యమైన రహదారులకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని కలెక్టర్లను ఆదేశించారు. జిల్లా యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉంటూ పరిస్థితులను సమీక్షించాలని స్పష్టం చేశారు. అదే సమయంలో, ప్రస్తుతం కురుస్తున్న వర్షపు నీటిని సాధ్యమైనంత మేర సంరక్షించుకోవాలని మంత్రి సూచించారు. పంటలకు హాని కలిగించే చోట నీటిని తొలగిస్తూనే, చెరువులు, జలాశయాలు, ఇతర నీటి వనరుల్లో నీటిని నిల్వ చేసి భవిష్యత్తు సాగు, తాగునీటి అవసరాలకు వినియోగించుకునేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక, మత్స్య శాఖలు సమన్వయంతో పనిచేస్తూ రైతులకు, ప్రజలకు నిరంతర సహాయం అందించాలని అచ్చెన్నాయుడు ఆదేశించారు.

# టోరెంట్, వెల్ స్పన్, ఆస్టల్.. అహ్మదాబాద్‌లో రెండో రోజు కూడా నారా లోకేశ్ బిజీబిజీ...

మొదటిపేజీ తరువాయి

క్లీన్ ఎనర్జీ, ఫార్మా, టెక్స్‌టైల్స్, మౌలిక సదుపాయాలు, డేటా సెంటర్లు, తయారీ వంటి కీలక రంగాల్లో ఏపీలో ఉన్న అవకాశాలను వారికి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ పారిశ్రామిక విధానాలు, అందిస్తున్న ప్రోత్సాహకాలను తెలియజేసి, పెట్టుబడులు పెట్టాల్సిందిగా ఆహ్వానించారు. లోకేశ్ ప్రతిపాదనలపై కంపెనీల ప్రతినిధులు సానుకూలంగా స్పందించి, వాటిని పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. క్లీన్ ఎనర్జీలో ఏపీని ఎంచుకోండి: టోరెంట్ గ్రూప్‌తో లోకేశ్ ఫార్మా, పవర్ రంగాల్లో అగ్రగామిగా ఉన్న టోరెంట్ గ్రూప్ చైర్మన్ సమీర్ మెహతా, ఇతర డైరక్టర్లతో మంత్రి లోకేశ్ భేటీ అయ్యారు. రాష్ట్రంలోని ఫార్మా క్లస్టర్లలో ఏపీఐ, ఇంటర్మీడియట్ తయారీ సామర్థ్యాన్ని విస్తరించాలని కోరారు. ముఖ్యంగా, పునరుత్పాదక ఇంధన రంగంలో టోరెంట్ గ్రూప్ ప్రణాళికలను ప్రస్తావిస్తూ.. సౌర, పవన, హైబ్రిడ్ ప్రాజెక్టులకు ఏపీ అనువైనదని తెలిపారు. పంప్డ్-స్టోరేజ్, గ్రీన్ హైడ్రోజన్ వంటి క్లీన్ ఎనర్జీ ప్రాజెక్టులకు రాష్ట్రాన్ని గమ్యస్థానంగా ఎంచుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై సమీర్ మెహతా స్పందిస్తూ.. 2030 నాటికి 10 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని సాధించడమే తమ లక్ష్యమని, ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలను తప్పక పరిశీలిస్తామని చెప్పారు. కాకినాడలో ఇండస్ట్రియల్ పార్క్: వెల్ స్పన్ గ్రూప్‌కు ప్రతిపాదన టెక్స్‌టైల్స్, మౌలిక సదుపాయాల రంగంలో ప్రసిద్ధిగాంచిన వెల్ స్పన్ వరల్డ్ గ్రూప్ సీఈఓ నితిన్ జైన్‌తో లోకేశ్ సమావేశమయ్యారు. గతంలో దావోస్‌లో సీఎం చంద్రబాబుతో జరిగిన చర్చల పురోగతిని సమీక్షించారు. విశాఖపట్నంలో వెల్స్‌పన్ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ (జీసీసీ) ఏర్పాటు చేయాలని ఆహ్వానించారు. కాకినాడలో టెక్స్‌టైల్స్, లాజిస్టిక్స్, పైపుల తయారీ, గ్రీన్ అమ్మోనియా యూనిట్లతో కూడిన ఇండస్ట్రియల్ పార్క్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. నితిన్ జైన్ మాట్లాడుతూ.. ప్రస్తుతం కర్నూలు, కడపలో తమ సంస్థ 100 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టును నిర్వహిస్తోందని, తాజా ప్రతిపాదనలను కూడా పరిశీలిస్తామని తెలిపారు. నెల్లూరులో ఆయిల్ రిఫైనరీలు: గోకుల్ ఆగ్రోతో చర్చలు వంట నూనెల తయారీలో పేరొందిన గోకుల్ ఆగ్రో రిసోర్సెస్ చైర్మన్ కనుభాయ్ ఠక్కర్‌తో లోకేశ్ భేటీ అయ్యారు. నెల్లూరు జిల్లా కృష్ణపట్నంలో ఇప్పటికే ఉన్న ప్లాంట్‌కు అదనంగా పామాయిల్, సోయాబీన్ ఆయిల్ రిఫైనరీ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. దీనిపై కనుభాయ్ ఠక్కర్ స్పందిస్తూ.. కృష్ణపట్నంలో తమ ప్లాంట్ 2024 నుంచి ఉత్పత్తి ప్రారంభించిందని, దక్షిణాది మార్కెట్ల కోసం విస్తరణ ప్రణాళికలు ఉన్నాయని తెలిపారు. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనను పరిశీలనలోకి తీసుకుంటామని హామీ ఇచ్చారు. విశాఖలో టైర్ల తయారీ యూనిట్: చిరిపాల్ గ్రూప్‌కు ఆహ్వానం టెక్స్‌టైల్స్, కెమికల్స్ రంగాల్లోని చిరిపాల్ గ్రూప్ మేనేజింగ్ డైరక్టర్ బ్రిజ్ మోహన్ చిరిపాల్‌తో మంత్రి లోకేశ్ సమావేశమయ్యారు. విశాఖపట్నం కనెక్టివిటీ, మౌలిక వసతులను వివరిస్తూ.. అక్కడ గ్రీన్‌ఫీల్డ్ టైర్ల తయారీ ప్రాజెక్టును ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై బ్రిజ్ మోహన్ చిరిపాల్ స్పందిస్తూ.. ప్రస్తుతం తమకు పలు రాష్ట్రాల్లో తయారీ యూనిట్లు ఉన్నాయని, టైర్ల తయారీకి సంబంధించి ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనను పరిశీలిస్తామని అన్నారు. డేటా సెంటర్లలో పెట్టుబడులు పెట్టండి: ఎస్టీ టెలీమీడియాతో లోకేశ్ డేటా సెంటర్ల దిగ్గజం ఎస్టీ టెలీమీడియా వైస్ ప్రెసిడెంట్ గౌతమ్ జెనాతో లోకేశ్ భేటీ అయ్యారు. విశాఖపట్నం డేటా సెంటర్ హబ్‌గా ఎదుగుతోందని, ఇప్పటికే గూగుల్, రిలయన్స్ వంటి సంస్థలు ముందుకు వచ్చాయని తెలిపారు. ఈ నేపథ్యంలో విశాఖలో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు. దీనిపై గౌతమ్ జెనా స్పందిస్తూ.. తమ సంస్థ కార్యకలాపాలను వివరించి, ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనను పరిశీలిస్తామని చెప్పారు. విశాఖలో ప్రీ ఫ్యాబ్ కేంద్రం: ఈప్యాక్ గ్రూప్‌తో భేటీ ప్రీ ఫ్యాబ్ నిర్మాణ రంగంలో పేరొందిన ఈప్యాక్ గ్రూప్ చైర్మన్ భజరంగ్ బోత్రాతో లోకేశ్ సమావేశమయ్యారు. డేటా సెంటర్ల నిర్మాణానికి అవసరమైన ప్రీ ఫ్యాబ్ నిర్మాణ కేంద్రాన్ని విశాఖలో ఏర్పాటు చేయాలని కోరారు. భజరంగ్ బోత్రా మాట్లాడుతూ.. ఇప్పటికే శ్రీసిటీలో తమకు తయారీ యూనిట్లు ఉన్నాయని, విశాఖ ప్రతిపాదనను కూడా పరిశీలిస్తామని తెలిపారు. పైపుల తయారీ కేంద్రం ఏర్పాటు చేయండి: ఆస్టల్ పైప్స్‌తో సమావేశం పైపుల తయారీలో అగ్రగామిగా ఉన్న ఆస్టల్ పైప్స్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ అల్కేష్ పంచల్‌తో మంత్రి లోకేష్ చర్చలు జరిపారు. రాష్ట్రంలో నిర్మాణ రంగం వేగంగా అభివృద్ధి చెందుతున్నందున, కాకినాడ లేదా అనకాపల్లిలో పైపుల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఆహ్వానించారు. అల్కేష్ పంచల్ స్పందిస్తూ.. తమకు దేశవ్యాప్తంగా విస్తృత నెట్‌వర్క్ ఉందని, ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనను పరిగణనలోకి తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# అవగాహన పెంచుకుందాం ఐక్యంగా ముందుకు సాగుదాం.

### కార్మికులకు అన్యాయం జరుగుతే ఊరుకునేది లేదు.

### మంథని మాజీ శాసనసభ్యులు పుట్ట మధుకర్

### టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి.

### అర్జీత్రీలో సెంట్రల్ డివిజన్ ముఖ్య నాయకులకు కొత్త కార్మిక చట్టాలపై ప్రత్యేక వర్క్ షాప్.

ప్రజా సీమ) :

కార్మిక చట్టాలపై మరింత అవగాహన పెంచుకొని కార్మికుల సంక్షేమం కోసం ఐక్యంగా నిరంతరం పాటుపడడం ద్వారా కార్మికుల మన్ననలు పొందుతూ తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘాన్ని మరింత దృఢంగా ముందుకు తీసుక పోగలుగుతామని మంథని మాజీ శాసనసభ్యులు పెద్దపెల్లి మాజీ జెడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్ తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు మిరియాల రాజిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సెంటినరీ కాలనీలోని సాయిరాం గార్డెన్ లో అర్జీ త్రీ ఏపీ డివిజన్ టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు నాగేల్లి సాంబయ్య ఆధ్వర్యంలో సెంట్రల్ కమిటీ మరియు డివిజన్ కమిటీ ముఖ్య నాయకులకు సింగరేణి కార్మికుల సమస్యలు, హక్కులు ,సంక్షేమం, కొత్త లేబర్ కోడ్ లపై అవగాహన మరియు శిక్షణతో కూడిన వర్క్ షాప్ ను నిర్వహించారు. ఇట్టి కార్యక్రమానికి సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ నూనె కొమరయ్య అధికార ప్రతినిధి పర్లపల్లి రవి డిప్యూటీ జనరల్ సెక్రెటరీ పింగిలి సంపత్ రెడ్డి అతిథులుగా పాల్గొనగా సింగరేణి మాజీ పర్సనల్ అధికారి ముప్పిడి రవీందర్ రెడ్డి కార్మిక చట్టాలు మరియు సంక్షేమ కార్యక్రమాలు తదితర అంశాలపై నాయకులకు శిక్షణ కల్పించారు. ఈ సందర్భంగా పుట్ట మధు మిర్యాల రాజిరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వాలు కానీ గెలిచిన సంఘాలు కానీ కార్మికులకు అన్యాయం చేయాలని చూస్తే ఎట్టి పరిస్థితుల్లో ఊరుకునేది లేదని హెచ్చరించారు. కార్మికులకు అలవి గాని హామీలు ఇచ్చి బూటకపు హామీలతో మభ్యపెట్టి గెలిచిన సంఘాలు వాళ్ళ కాలపరిమితి ముగిసే సమయానికి కూడా ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చక తీరని ద్రోహం చేశాయని దుయ్యబట్టారు. అదేవిధంగా సింగరేణి కంపెనీకి రావలసిన విద్యుత్ బకాయిలు 52,000 కోట్లకు పైగా పేరుకుపోయిన బాధ్యత కలిగిన సంఘాలు ఏ ఒక్కరోజు ప్రభుత్వాన్ని ప్రశ్నించక కంపెనీని నిర్వీర్యం చేస్తున్నాయని దీనిపై కార్మికుల పక్షాన కంపెనీని నిలబెట్టుకునేందుకు గట్టిగా పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు. ప్రభుత్వం సింగరేణిని ఒక ఆర్థిక వనరుగా వాడుకుంటూ జల్సాలకు ఫుట్ బాల్ క్రీడలకు సింగరేణి సొమ్మును దుబారా చేస్తూ కార్మికులకు మాత్రం తీరని దుఃఖాన్ని మిగులుస్తున్నారని విమర్శించారు. ఎన్నికల సందర్భంలో నెలకు మూడు మెడికల్ బోర్డులు నిర్వహిస్తామని ఊదరగొట్టి మూడేళ్లలో 300 మందిని సైతం అన్ఫిట్ చేయించలేకపోయారని దీనిపై



కార్మికలోకమంతా కన్నెర్ర చేస్తున్నదన్నారు. డివిజన్లో కార్మికుల చిన్నచిన్న సమస్యలు సైతం పరిష్కరించలేక పోయారని, సంక్షేమం విషయంలో వీరి పాలనలో ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిదని పేర్కొన్నారు. కార్మిక వాడల్లో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని డ్రైనేజీలు సైతం శుభ్రంగా ఉంచలేకపోతున్నారని, 150 మాస్టర్ లేక పోతే డిస్మిస్లు చేస్తూ కార్మికులకు తీరని అన్యాయం చేస్తున్నారని వారి పాపం ఉసురు ఊరికే పోదన్నారు. బి ఆర్ఎస్ పాలనలో కెసిఆర్ ద్వారా 16,000 మందికి పైగా సీనియర్ కార్మికులకు మెడికల్ అన్ఫిట్ చేసి వారి పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వడం జరిగిందని వివరించారు. కార్మికులు అడగకపోయినా ఒక శాతం కరెంటు చార్జీల రికవరీని పూర్తిగా రద్దుచేసి ఏసీ సౌకర్యాన్ని కల్పించిన ఘనత తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘాన్ని అన్నారు. అనేక అండర్ గ్రౌండ్ గనులను మరియు ఓపెన్ కాసులను ప్రారంభించుకోవడమే కాకుండా ఉన్న వాటిని విస్తరణ అనుమతులు తీసుకురావడం జరిగిందని వివరిస్తూనే తల్లిదండ్రులకు సైతం కార్పొరేట్ వైద్యం అందించి ఆర్థిక చేయూతను అందించడం జరిగిందని ఇది సింగరేణి వ్యాప్తంగా కార్మికులకు ఎంతో లాభం చేరుకోరుస్తుందన్నారు. ప్రస్తుత గుర్తింపు ప్రాతినిధ్య సంఘాల కాలపరిమితి ముగిసినందున కార్మిక కార్మిక నాయకత్వం మరింత ఐక్యంగా మరింత చైతన్యంగా సమస్యలపై పోరాటం సాగిస్తూ కార్మికుల జరుగుతున్న అన్యాయాన్ని వివరిస్తూ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ నిరంతరం పోరాటం కొనసాగిద్దామని దీనికి అధినాయకత్వం అండదండలు ఎల్లప్పుడూ ఉంటాయని భరోసానిచ్చారు. సందర్భం ఏదైనా పరిస్థితులు ఎట్లున్న కార్మిక సమస్యల పట్ల రాజీలేని పోరాటాన్ని కొనసాగిద్దామని అర్జీత్రీలో గులాబీ జెండాను ఎగరవేసేందుకు కార్మికులు కార్యకర్తలను సమీకరించుకొని చైతన్యపరచుకొని కార్మికుల్లో అభిమానాన్ని చూడమని అఖండ మెజారిటీ సాధించి ఎన్నికలు ఎప్పుడు జరిగిన విజయం సాధించేలా ప్రణాళికతో ముందుకు సాగుదామన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ రామగిరి మండల శాఖ అధ్యక్షుడు శంకేష్ రవీందర్ కమాన్పూర్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పూదరి సత్యనారాయణ రామగిరి మాజీ జెడ్పి సభ్యులు శారద కుమార్ పట్టణ అధ్యక్షుడు కాపుర బోయిన భాస్కర్ తోపాటు సెంట్రల్ కమిటీ నాయకులు మరియు డివిజన్ కమిటీ నాయకులు ఓ సి వన్ ఓసి టు ఏ ఎల్ పి సిహెచ్పి ఎస్ అండ్ పిసి పిట్ సెక్రటరీలు అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీలు సోషల్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

# రేపటిలోగా సీఈసీ రాజీనామా చేయాల్సిందే.. లేదంటే గాంధీ జయంతి నుంచి దేశవ్యాప్త నిరసనలు: సీజేపీ

మొదటిపేజీ తరువాయి

శనివారం లోగా ఆయన రాజీనామా చేయకపోతే గాంధీ జయంతి అయిన అక్టోబర్ 2 నుంచి దేశవ్యాప్త నిరసనలు చేపడతామని తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. జ్ఞానేశ్ కుమార్ తప్పుకోకపోతే తమ ఆందోళనను దేశంలోని అన్ని ప్రధాన నగరాలకు విస్తరింపజేస్తామని స్పష్టం చేశారు. ఈ మేరకు నేడు అభిజీత్ దీప్కే 'ఎక్స్'లో ఒక పోస్ట్ చేశారు. "రేపటిలోగా జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయకపోతే, సీజేపీ తన దేశవ్యాప్త నిరసనను అక్టోబర్ 2న ముంబైలో ప్రారంభించి, భారతదేశంలోని ఇతర నగరాలకు కూడా తీసుకువెళుతుంది. ఈ గాంధీ జయంతి నాడు ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి ప్రతిజ్ఞ చేద్దాం" అని ఆయన పిలుపునిచ్చారు. అంతకుముందు గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో దీప్కే మాట్లాడుతూ.. జ్ఞానేశ్ కుమార్‌ను ఈ దేశానికి అతిపెద్ద ద్రోహిగా, దేశ వ్యతిరేకిగా అభివర్ణించారు. "ఎన్నికల సంఘంపై వచ్చిన ఒక నివేదిక ప్రకారం జ్ఞానేశ్ కుమార్ ప్రజాస్వామ్యాన్ని పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నారు. మన దేశంలో ప్రజలు తమకు నచ్చిన ప్రభుత్వాన్ని ఎన్నుకోవడమే ప్రజాస్వామ్యం. కానీ, జ్ఞానేశ్ కుమార్ సీఈసీ అయినప్పటి నుంచి, ఎవరు ఓటు వేయాలో, ఎవరు వేయకూడదో ప్రభుత్వమే నిర్ణయిస్తోంది. ఇది ప్రజాస్వామ్యం కాదు, నిరంకుశత్వం. దీనికి ప్రధాన కారకుడు జ్ఞానేశ్ కుమార్" అని దీప్కే తీవ్ర ఆరోపణలు చేశారు. ఆయన 48 గంటల్లో పదవి నుంచి దిగిపోవాలని అల్టిమేటం జారీ చేశారు. ఎస్ఐఆర్, ఓటర్ డేటా యాక్సెస్, కొత్త ఓటర్ల నమోదు వంటి కీలక అంశాలపై ఎన్నికల సంఘంలోనే విభేదాలు తలెత్తాయని వస్తున్న వార్తల నేపథ్యంలో సీజేపీ ఈ ఆరోపణలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇదే సమావేశంలో పార్టీ సహ కన్వీనర్ సౌరవ్ దాస్ మాట్లాడుతూ.. ప్రస్తుత వ్యవస్థ దేశాన్ని ఒక పెద్ద ప్రహసనంగా మార్చేసిందని విమర్శించారు. "ఈ వ్యవస్థ అవినీతిమయమైంది, విఫలమైంది. దేశంలోని యువత మార్పును కోరుకుంటోంది. ప్రాథమిక మార్పులు అవసరమని వారు డిమాండ్ చేస్తున్నారు" అని ఆయన వ్యాఖ్యానించారు.

# యూపీఐ లావా దేవీలపై చార్జీలు..

## వినియోగదారులకు భారం లేదన్న నిర్మలా సీతారామన్

మొదటిపేజీ తరువాయి

ఇప్పటికే డెబిట్, క్రెడిట్ కార్డుల ద్వారా జరిగే చెల్లింపుల్లో వ్యాపారులు ఇలాంటి రుసుములను భరిస్తున్నారని గుర్తుచేశారు. యూపీఐ చెల్లింపుల విషయంలోనూ ఈ చార్జీని కస్టమర్లపైకి నెట్టే అవకాశం ఉండదని మంత్రి తేల్చిచెప్పారు. డిజిటల్ చెల్లింపులను ఉపయోగించే ప్రజలకు సేవలు ఉచితంగానే, ఎప్పటిలాగే అంతరాయం లేకుండా అందుబాటులో ఉంటాయని తెలిపారు. తప్పుడు ప్రచారాలను నమ్మి ప్రజలు గందరగోళానికి గురికావొద్దని సూచించిన ఆమె, ఎండీఆర్ ద్వారా వసూలయ్యే సొమ్ము డిజిటల్ పేమెంట్ నెట్‌వర్క్ నిర్వహణలో భాగస్వామ్యమైన బ్యాంకులు, చెల్లింపు సేవల సంస్థల వ్యవస్థాపక వ్యయాలకే ఉపయోగపడుతుందని వివరించారు.

# ప్రతి రైతు ఎఫ్ బి ఓ షేర్లు తీసుకోవాలి

## చైర్మన్ ఇనగంటి భాస్కరరావు.

ప్రజా సీమ) :

కమాన్ పూర్ వ్యవసాయ సహకార సంఘం పరిధిలోని ప్రతి రైతు ఎఫ్ బి ఓ షేర్లు తీసుకోవాలని ట్యాక్స్ చైర్మన్ ఇనగంటి భాస్కర్ రావు అన్నారు. శుక్రవారం రోజున వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయంలో షేర్లు తీసుకున్న రైతులకు సర్టిఫికెట్లను పాలకవర్గం ఆధ్వర్యంలో ఎఫ్.పి.ఓ వాటాదారులకు షేర్ సర్ కమాన్ పూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం పరిధిలో రైతు ఉత్పత్తిదారుల సంస్థ (ఎఫ్ బి ఓ)లో సభ్యత్వాలు పొంది, వాటా ధనం చెల్లించిన రైతులకు గురువారం షేర్ సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. .కార్యక్రమంలో పి.ఐ.సి చైర్మన్ ఇనగంటి భాస్కర్ రావు , వైస్ చైర్మన్ చిందం తిరుపతి మరియు డైరెక్టర్లు గుండేటి శ్రీమూర్తి , అడ్వాల చంద్రయ్య , సైన్ లో సత్యనారాయణ,వరాల నర్సింగం , బానోతు లక్ష్మి , చేతుల మీదుగా సభ్యులకు అధికారికంగా ఈ షేర్ సర్టిఫికెట్లను అందజేశారు. ?ఈ సందర్భంగా పి.ఐ.సి చైర్మన్ ఇనగంటి భాస్కర్ రావు మాట్లాడుతూ... సహకార రంగం ద్వారా రైతులను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ ఎఫ్.పి.ఓ సేవలను విస్తరిస్తున్నట్లు తెలిపారు. రైతులు సమైక్యంగా ఏర్పడి విత్తనాలు, ఎరువుల కొనుగోలుతో పాటు పంట ఉత్పత్తుల విక్రయాల ద్వారా ఎక్కువ లాభాలు సాధించవచ్చని సూచించారు. ఎఫ్.పి.ఓలో భాగస్వాములైన రైతులకు సొసైటీ ద్వారా అందించే అన్ని రకాల సదుపాయాలు, ప్రోత్సాహకాలు అందుబాటులో ఉంటాయని, మిగతా రైతులు కూడా ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని ఎఫ్.పి.ఓలో సభ్యులుగా చేరాలని కోరారు. అలాగే ఒక్కో షేరు 100 రూపాయలు ఉంటుందని ప్రతి రైతు కనీసం 20 షేర్లు చేసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా కార్యదర్శి తిమ్మరాజు సంతోష్ కుమార్ మాట్లాడుతూ రుణాలు తీసుకున్న రైతులు సకాలంలో చెల్లించని యెడల వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే ఈ సంవత్సరం ఏప్రిల్ నుండి సెప్టెంబర్ వరకు అర్ధవార్షిక లెక్కలు చూడడం జరిగిందని పేర్కొన్నారు స్వల్ప కాలిక రుణాల యొక్క వడ్డీ వెంటనే చెల్లించాలని కోరారు. ఈ సమావేశంలో ? ప్యాక్స్ సీఈవో తిమ్మరాజు సంతోష్ కుమార్, సిబ్బంది రవీందర్, కుమార్, సాబీర్ మరియు పరిధిలోని రైతు సోదరులు, వాటాదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# కాకుమాను హఠాన్మరణానికి కూటమి ప్రభుత్వమే కారణం

**రాజశేఖర్‌పై అక్రమ కేసులు.. పోలీసుల వేధింపులు**

**డీఎస్సీ నిరసనలో పోలీసుల తోపులాటే మృతికి కారణం**

**-- వైవీ సుబ్బారెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి**

(ప్రజా సీమ) ::

వైఎస్సార్‌సీపీ ప్రచార కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు కాకుమాను రాజశేఖర్ హఠాన్మరణానికి కూటమి ప్రభుత్వం సృష్టించిన ఒత్తిళ్లు, పోలీసుల వేధింపులే కారణమని వైఎస్సార్‌సీపీ నేతలు ఆరోపించారు. హైదరాబాద్‌లో గురువారం మృతి చెందిన రాజశేఖర్ పార్థివదేహానికి శుక్రవారం ఒంగోలులోని క్లోపేటలో పార్టీ పార్లమెంటరీ పార్టీ నేత వైవీ సుబ్బారెడ్డి, స్టేట్ కో--ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డితో పాటు పలువురు నేతలు నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం కాకుమాను రాజశేఖర్ ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేసిన నాయకుడని వైవీ సుబ్బారెడ్డి అన్నారు. ఒంగోలు కౌన్సిలర్‌గా రాజకీయ ప్రస్థానం ప్రారంభించి కాంగ్రెస్, అనంతరం వైఎస్సార్‌సీపీలో రాష్ట్ర స్థాయి నేతగా ఎదిగారని తెలిపారు. ఇటీవల కూటమి ప్రభుత్వ విధానాలపై రౌండ్‌టేబుల్ సమావేశాలు నిర్వహిస్తూ ప్రజా సమస్యలపై పోరాడారని పేర్కొన్నారు.డీఎస్సీ నిరసనలో తోపులాటపై ఆరోపణలు ఈ నెల 22న విజయవాడలోని శాప్ కార్యాలయం వద్ద డీఎస్సీ అంశంపై నిర్వహించిన నిరసనలో రాజశేఖర్ పాల్గొన్నారని, ఆ సమయంలో పోలీసుల తోపులాటలో ఆయన పలుమార్లు కిందపడటంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారని వైవీ సుబ్బారెడ్డి ఆరోపించారు. అనంతరం ఆయనపై కేసులు నమోదయ్యాయన్న సమాచారంతో మానసిక ఒత్తిడికి గురయ్యారని తెలిపారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ వెళ్లిన కొద్దిసేపటికే రాజశేఖర్ మృతి చెందడం బాధాకరమన్నారు.నిరసన గళాన్ని అణిచే ప్రయత్నం: సజ్జల డీఎస్సీ నియామకాల్లో అక్రమాలపై యువత తరఫున శాంతియుతంగా నిరసన తెలిపిన రాజశేఖర్‌పై పోలీసులు దాడికి దిగారని సజ్జల రామకృష్ణారెడ్డి ఆరోపించారు. పోలీసుల తోపులాట సమయంలో ఆయన పలుమార్లు కిందపడినట్లు తెలిపారు. అనంతరం కూడా వేధింపులకు గురయ్యారన్న సమాచారం ఉందన్నారు. పోలీసు వ్యవస్థను ఉపయోగించి ప్రతిపక్ష నేతల గొంతును అణిచివేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని





ఆరోపించారు.కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందిపార్టీ కేంద్ర కార్యాలయంలో చురుగ్గా పనిచేస్తూ ప్రచార కమిటీ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించిన రాజశేఖర్ మృతి వైఎస్సార్‌సీపీకి తీరని లోటని నేతలు అన్నారు. ఆయన కుటుంబానికి పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. రాజశేఖర్ సేవలను పార్టీ శ్రేణులు ఎప్పటికీ గుర్తుంచుకుంటాయని పేర్కొన్నారు.

# పేద బ్రాహ్మణ కుటుంబాలకు 'గరుడ దహన సంస్కారాలు'

(ప్రజా సీమ) :



పేద బ్రాహ్మణ కుటుంబాలకు అండగా 'గరుడ దహన సంస్కారాల' పథకాన్ని కూటమి ప్రభుత్వం పునఃప్రారంభించడంపై ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ కె. బుచ్చి రామ్ ప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. అర్హులైన కుటుంబాలకు అంత్యక్రియల కోసం రూ.10 వేల ఆర్థిక సహాయం అందించనున్నట్లు తెలిపారు. ఆపద సమయంలో పేద కుటుంబాలకు ఈ సాయం ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. పథకాన్ని పునఃప్రారంభించిన సీఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, ప్రధాని నరేంద్ర మోదీ, ఎండోమెంట్స్ మంత్రి అనం రామనారాయణరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

# నరసరావుపేటను కరువు మండలంగా ప్రకటించాలి

(ప్రజా సీమ) :

నరసరావుపేట మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి, వ్యవసాయ కూలీలకు వెంటనే ఉపాధి కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. అనంతరం డీటీకి వినతిపత్రం సమర్పించారు.వలస కార్మికుల వలసలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని, అధిక ధరలను నియంత్రించాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను విరమించుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు.కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కార్యదర్శి చేబూరి నాగేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వైదన వెంకట్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు మహంకాళి సుబ్బారావు, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మేకపోతుల నాగేశ్వరరావు, ఏఐటీయూసీ జిల్లా నాయకులు ఉప్పలపాటి రంగయ్య, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు జమ్మలగుడి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



# కరువు పరిస్థితులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

**డీఆర్‌సీ సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు**

(ప్రజా సీమ) ::

పల్నాడు జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులకు సకాలంలో సహాయం అందించి పంటలను కాపాడేందుకు సమగ్ర చర్యలు చేపట్టాలని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు కోరారు. శుక్రవారం కలెక్టరేట్‌లో మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధ్యక్షతన జరిగిన డీఆర్‌సీ సమావేశంలో ఆయన రైతుల సమస్యలను ప్రస్తావించారు.జిల్లాలో సాధారణ సాగు విస్తీర్ణం 2,08,560 హెక్టార్లు కాగా, ఇప్పటివరకు 1,48,021 హెక్టార్లలో మాత్రమే సాగు జరిగిందని తెలిపారు. వర్షాధార రైతులకు సబ్సిడీ విత్తనాలు, వ్యవసాయ ఇన్‌పుట్స్ అందించడంతో పాటు ప్రత్యామ్నాయ పంటలపై సాంకేతిక సూచనలు ఇవ్వాలని అధికారులను కోరారు. రబీ సీజన్‌కు ముందుగానే విత్తనాల లభ్యత, సాగునీటి వినియోగంపై కార్యాచరణ రూపొందించాలని సూచించారు.సమావేశంలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, కలెక్టర్ కృతిక శుక్ల, ఎమ్మెల్యేలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# 24 మద్యం షాపులకు నోటిఫికేషన్

(ప్రజా సీమ) :



పల్నాడు జిల్లాలో రెన్యువల్‌కు నోచుకోని ఓపెన్ కేటగిరీలోని 24 మద్యం షాపులకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ మణికంఠ తెలిపారు. వచ్చే నెల 1వ తేదీ రాత్రి 12 గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్‌లో ఎక్సైజ్ స్టేషన్ లేదా ఈఎస్ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించవచ్చన్నారు. ప్రతి దరఖాస్తుకు రూ.3 లక్షల ఫీజు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

# డీఆర్సీ సమావేశంలో అభివృద్ధి పనులపై సమీక్ష

**వర్షాభావ పరిస్థితుల్లో తాగు, సాగునీటికి ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు**

(ప్రజా సీమ) ::

నరసరావుపేట కలెక్టరేట్‌లో జిల్లా అభివృద్ధి సమీక్షా మండలి (డీఆర్సీ) సమావేశం నిర్వహించారు. చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, ఎమ్మెల్యేలు ప్రత్తిపాటి పుల్లారావు, కన్నా లక్ష్మీనారాయణ, అరవిందబాబు, జూలకంటి బ్రహ్మారెడ్డి, జీడీసీసీ చైర్మన్ మక్కెన మల్లికార్జునతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రత్యామ్నాయ నీటి వనరులను సిద్ధం చేసి తాగునీటి సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.అభివృద్ధి పనులకు వేగం పెంచి, ప్రజాప్రతినిధులు--అధికారులు సమన్వయంతో పనిచేసి జిల్లా సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు.



# కలెక్టరేట్‌లో డీఆర్సీ సమీక్షా సమావేశం

(ప్రజా సీమ) :

జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం జిల్లా సమీక్షా కమిటీ (డీఆర్సీ) సమావేశం జరిగింది. జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, జిల్లా కలెక్టర్ కృత్తికా శుక్లా, పలువురు ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు.జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులు, నూతన ప్రాజెక్టుల పురోగతిపై సమీక్షించారు. ఎల్‌నినో ప్రభావంతో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, సాగు, తాగునీటి ఎద్దడి నివారణకు తీసుకోవాల్సిన తక్షణ చర్యలపై చర్చించారు. రైతులకు ఇబ్బందులు లేకుండా అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని సూచించారు.




# యువత భవిష్యత్తుకు కూటమి ప్రభుత్వం భరోసా

**నైపుణ్యాభివృద్ధితో ఉపాధి అవకాశాలు**

**వ్యవసాయ అనుబంధ రంగాల్లో యువత రాణించాలి**

(ప్రజా సీమ) ::

యువత ఉజ్వల భవిష్యత్తుకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. బాపట్లలోని ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ కళాశాలలో నిర్వహించిన 'యువత భవితకు భరోసా' కార్యక్రమంలో ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్‌తో కలిసి పాల్గొన్నారు.డిగ్రీలతో పాటు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని యువతకు సూచించారు. వ్యవసాయ, అనుబంధ రంగాల్లో ఆధునిక సాంకేతికతతో విస్తృత ఉపాధి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. యువత ఉద్యోగాలకే పరిమితం కాకుండా నైపుణ్యాలతో పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని సూచించారు. యువత సంక్షేమం, బాపట్ల అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని నరేంద్రవర్మ భరోసా ఇచ్చారు.






# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం: ఎమ్మెల్యే అరవింద్ బాబు

(ప్రజా సీమ) ::

పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల వేదికలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు ప్రజల నుంచి సమస్యలను నేరుగా తెలుసుకున్నారు. సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రజల సమస్యలను వినడమే కాకుండా, వాటికి పరిష్కారం చూపించడమే తన ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రతి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.



# విశాఖలో డేటా సెంటర్లకు పెట్టుబడులు పెట్టండి

**ఎస్‌టీ టెలీమీడియా ప్రతినిధులతో మంత్రి లోకేష్ భేటీ**

(ప్రజా సీమ) :

విశాఖపట్నంలో డేటా సెంటర్ల ఏర్పాటుకు పెట్టుబడులు పెట్టాలని మంత్రి నారా లోకేష్ ఎస్‌టీ టెలీమీడియా ప్రతినిధులను ఆహ్వానించారు. ఎస్‌టీ టెలీమీడియా వైస్ ప్రెసిడెంట్ గౌతమ్ జెనా, సీఓఓ లలిత్ టి. కన్నాలతో ఆయన సమావేశమయ్యారు. విశాఖ డేటా సెంటర్ హబ్‌గా అభివృద్ధి చెందుతోందని, గూగుల్, రిలయన్స్ వంటి సంస్థలు ఇప్పటికే ముందుకు వచ్చాయని తెలిపారు. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలిస్తామని గౌతమ్ జెనా వెల్లడించారు.




# నూతన ఎస్పీని కలిసిన మానవ హక్కుల సంఘం నాయకులు

(ప్రజా సీమ)

జిల్లాకు నూతన ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన పంకజ్ కుమార్ మీనాను ఎం.ఆర్. మానవ హక్కుల సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలోని పలు సమస్యలను ఎస్పీ దృష్టికి తీసుకెళ్లగా, సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. అనంతరం ఎస్పీని సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.వి.బి.ఎల్. కిరణ్ కుమార్, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ పోలేపల్లి వెంకట లక్ష్మీనారాయణ, మహిళా విభాగం అధ్యక్షురాలు శిద్ధం కృష్ణవేణి, గోళ్ల అపర్ణ, కోలా శ్రీనివాసరావు, తాళ్ల అల్లూరి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



# 600 ఎకరాల గురించి అడిగితే 65 ఏళ్ల రాజకీయ చరిత్ర ప్రస్తావించడం హాస్యాస్పదం.

## కౌంటర్లతో కాదు... 80 మంది రెవెన్యూ బృందాలు సర్వే చేసిన రిపోర్ట్ ను ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి బయట పెట్టి సమాధానం చెప్పాలి..

## మాదిగదల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి ముల్లంగి చంద్రయ్య డిమాండ్...

**పీలేరు ప్రజా సీమ :**

పీలేరు సమీపంలో 600 ఎకరాల ప్రభుత్వ భూ ఆక్రమ పై ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి నోరు మెదపడం లేదని మేము ప్రశ్నిస్తే 65 ఏళ్ల రాజకీయ చరిత్ర ప్రస్తావించడం హాస్యాస్పదమని మాదిగదల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి ముల్లంగి చంద్రయ్య మండిపడ్డారు. ముల్లంగి చంద్రయ్య నేడు పీలేరులో ప్రైవేట్ హాల్లో విలేకరులతో మాట్లాడుతూ గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రస్తుత ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి పీలేరు సమీపంలో దాదాపు 600 ఎకరాల సుమారు 400 కోట్ల ప్రభుత్వ భూమి ఆక్రమకు గురైందని లోకాయుక్తకు ఫిర్యాదు చేసి 80 మంది రెవెన్యూ సిబ్బందితో సర్వే చేయించి ఆక్రమణ బయటపెట్టి నేను అధికారంలోకి వస్తే అక్రమార్కులపై చర్యలు చేపట్టి 600 ఎకరాల ప్రభుత్వ భూమి వ్యవహారం నిగ్గు తేలుస్తానని అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న ప్రస్తుత ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి ఇప్పుడు అధికారం చేపట్టి రెండున్నర సంవత్సరం పూర్తికావస్తున్న భూముల వ్యవహారం పై ప్రస్తావించకపోవడం మరియు అక్రమ నిర్మాణాలను మేమే కూల్చామని చెబుతున్నారు. ఇప్పుడు కూల్చిన ప్రదేశాలలో మరల ఇండ్లు కట్టారు ఇది వైసీపీతో లోపకాయ ఒప్పందం కాదా , 80 మంది రెవెన్యూ బృందం సర్వే చేసిన రిపోర్టు బయట పెట్టకపోవడానికి ఆంతర్యం ఏమిటి అని ఆయన మండిపడ్డారు. అదేవిధంగా మా ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన నేతలను మాపైకి ఉసిగొలిపి మాట్లాడించిన మాత్రాన 600 ఎకరాల భూ అక్రమ పై గతంలో ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి మాట్లాడిన మాటలు నేటికీ అందరు నోట్లో వినపడుతు న్నాయని ఎవరు మర్చిపోలేదని ఇకనైనా ఎమ్మెల్యే కొంతమంది వైసిపి నాయకులతో లోపకాయి ఒప్పందం లేకుంటే గతంలో నువ్వే ప్రత్యక్షంగా లేవనెత్తిన భూ అక్రమ పై స్పందించి సిటింగ్ జడ్జితో విచారణ జరిపించి నీ నిజాయితీ నిరూపించుకోవాలని లేనిపక్షంలో త్వరలో గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి పీలేరులో వాస్తవ పరిస్థితులను తెలియజేసి భూ అక్రమ సంబంధించిన నివేదికలను పూర్తి ఆధారాలతో సమర్పించడం జరుగుతుందని జరుగుతుందని ముల్లంగి చంద్రయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో మాదిగ దళ పోరాట సమితి నాయకులు ఈపూరి ఆంజనేయులు ,అమృతపురి మల్లికార్జున, ఇరపలపాటి ఆంజనేయులు, ముల్లంగి కిషోర్, పల్లెపోగు రెడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.



# హెల్మెట్ ధరించండి - క్షేమంగా గమ్యాలకు చేరండి

## - ద్విచక్ర వాహనదారులకు ట్రాఫిక్ సీఐ చాంద్ బాషా అవగాహన

**మదనపల్లె (ప్రజా సీమ) :**

హెల్మెట్ ధరించి తమ గమ్యస్థానాలు క్షేమంగా చేరాలని సీఐ చాంద్ బాషా ప్రజలకు సూచించారు.జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి,అదనపు ఎస్పీ వెంకటాద్రి,డీఎస్పీ బుచ్చిరాజు ఆదేశాల మేరకు శుక్రవారం పుంగనూరు రోడ్డు వై జంక్షన్ వద్ద ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ వాడకంపై ట్రాఫిక్ సీఐ తమ సిబ్బందితో కలిసి అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా సీఐ చాంద్ బాషా మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ రక్షణ కవచమని,ఎక్కడికైనా ప్రయాణం చేసేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు.హెల్మెట్ లేకుండా ప్రయాణం చేసే సందర్భాల్లో అనుకోకుండా ప్రమాదాల సంభవిస్తే ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉందన్నారు.ఒకవేళ తీవ్ర గాయాలైనచో చికిత్స కోసం ఆసుపత్రిలో లక్షలాది రూపాయలు వెచ్చించాల్సి వస్తుందన్నారు.హెల్మెట్ ఖరీదు రూ.1000 ఐతే వాటిని ధరించకపోవడం వల్ల జరిగే నష్టం లక్షల్లో ఉంటుందన్నారు.కావున ద్విచక్ర వాహనాలు నడిపే వారు,వెనుక వైపు కూర్చున్న వారు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలన్నారు.ఇకమీదట హెల్మెట్ లేకుండా ప్రయాణం చేసినా,వాహనాలకు రికార్డులు లేకపోయినా ట్రాఫిక్ నిబంధనల మేరకు జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు.దీనిని దృష్టిలో ఉంచుకొని వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు.



# పుంగనూరు కోనేటికి పూర్వవైభవం తీసుకురావడమే లక్ష్యం

## - హైందవ సంస్కృతికి ప్రతీకగా నిలిచింది

## - ప్రజల దాహార్తిని తీర్చిన చరిత్ర ఈ కోనేరు సొంతం

## - విశ్రాంత డీఎస్పీ సుకుమార్ బాబు వెల్లడి

**మదనపల్లె (ప్రజా సీమ) :**

జమీందారుల కాలంలో నిర్మించి,ఉమ్మడి చిత్తూరు జిల్లాల్లోనే సుదీర్ఘ చరిత్ర కలిగిన పుంగనూరు కోనేటికి పూర్వవైభవం తీసుకొద్దామని విశ్రాంత డిఎస్పి, తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత కె.సుకుమార్ బాబు పేర్కొన్నారు.దశాబ్దాల చరిత్ర కలిగిన ఈ కోనేటిలోని బావి నుండి పుంగనూరు ప్రజలు తాగునీటిని తీసుకెళ్లేవారన్నారు.తాము చిన్నతనంలో సైతం ఆ కోనేరు నుండి నీటిని తీసుకొచ్చి తాగే వారమని గుర్తుచేసుకున్నారు కొద్దిరోజుల క్రితం ఓ గుర్తు తెలియని వాహనం కోనేటి ప్రహరీ గోడను ఢీకొనడంతో గోడ దెబ్బతిందన్నారు.ఇది ఎంతో దురదృష్టకరమైన ఘటన అని ఆవేదన వ్యక్తం చేశారు.దీనిపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి సిసి కెమెరాలు ద్వారా కోనేటి ప్రహరీ గోడ ధ్వంసం కావడానికి కారణమైన డ్రైవర్,వాహనాన్ని కనుగొనే పనిలో నిమగ్నమయ్యారు. పూర్వం ప్రజలు స్వచ్ఛందంగా శుభ్రం చేయడం, పరిరక్షణకు కృషి చేయడం జరిగిందన్నారు. కోనేటిలో నియమ,నిష్టలతో స్నానాలు ఆచరించి స్నానాలు ఆచరించే వారని,చుట్టూ అనేక ఆలయాలు ఉన్నాయని,ఇది భారతీయ సంస్కృతిని చాటి చెబుతుందన్నారు. ఇటువంటి పరిస్థితులలో పుర ప్రజలు,భక్తులు ఐకమత్యంతో కోనేటికి మరమ్మత్తులు చేయించి పూర్వవైభవం తీసుకురావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు.జమీందారీ వంశస్థులు ఇక్కడ నివసించడం,కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా ప్రసిద్ధిగాంచిన శ్రీ సుగుటూరు గంగమ్మ జాతరతో పుంగనూరు రాష్ట్రస్థాయిలో ప్రసిద్ధిగాంచిందన్నారు.ఈ ప్రాంతంలో వెలసిన ఆలయాలతోపాటు కోనేటిని కాపాడుకోవాల్సిన ఆవశ్యకత మనపై ఉందన్నారు.పుంగనూరు కోనేటిని తిరుమల తిరుపతి దేవస్థానానికి అప్పగిస్తే బ్రహ్మాండమైన అభివృద్ధి చెందుతుందని, గత వైభవం సంతరించుకు ంటుందని ఆయనతోపాటు,పలువురు పట్టణ ప్రజలు అభిప్రాయపడుతున్నారు.



# వెలుగు సంస్థలో అట్టహాసంగా దీపిక పుట్టినరోజు వేడుకలు

## - దివ్యాంగులు,వృద్ధులకు అన్నవితరణ కార్యక్రమం

**మదనపల్లె (ప్రజా సీమ) :**

తిరుమల తిరుపతి దేవస్థానంలో పనిచేస్తున్న సుంకర కృష్ణ,సుంకర కళావతిల కుమార్తె,పద్మావతమ్మ మనువరాలు,కత్తి భరత్ సతీమణి కత్తి దీపిక జన్మదిన వేడుకలు అమ్మచెరువు మిట్ట నందు గల వెలుగు ప్రత్యేక పాఠశాలలో ఘనంగా జరిగాయి.ఇందులో భాగంగా దివ్యాంగులైన చిన్నారులు,వృద్ధుల సమక్షంలో కుమారుడు కత్తి సుశాంత్ కేక్ కట్ చేయగా దీపికకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా వెలుగు సెక్రటరీ ఎం.ఉదయ్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ సేవా కార్యక్రమాలలో సుంకర కృష్ణ కుటుంబం ఆదర్శమని కొనియాడారు.ప్రతి ఏడాది వారి కుటుంబ సభ్యుల పుట్టినరోజు వేడుకలను వెలుగు సంస్థ నందు జరుపుకోవడంతోపాటు అన్నవితరణ చేయడం అభినందనీయమని ప్రశంసించారు.ఆ భగవంతుడి ఆశీస్సులతో దీపిక ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని,భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాల చేపట్టాలని ఆకాంక్షించారు.అనంతరం దీపిక మాట్లాడుతూ మా తల్లిదండ్రులు చిన్నతనం నుండి సంస్కారంతోపాటు సేవాతత్వాన్ని అలవాటు చేశారన్నారు.తాము వృత్తిపరంగా బెంగళూరులో స్థిరపడినప్పటికీ తన కుమారుడు సుశాంత్ పుట్టినరోజు వేడుకలతోపాటు నా పుట్టినరోజు వేడుకలు వెలుగు సంస్థలో జరుపుకోవడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు.వెలుగు సంస్థలో దివ్యాంగులైన చిన్నారులకు,వృద్ధులకు పోషక విలువలతో కూడిన భోజనం,మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నారని కితాబునిచ్చారు.ప్రజలంతా సేవా కార్యక్రమాలలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వెలుగు కన్వీనర్ భాగ్యలక్ష్మి,ప్రిన్సిపాల్ లీనాకుమారి,వార్డెన్ స్వీటీ తదితరులు పాల్గొన్నారు.





# తుఫాన్ ప్రభావిత చిత్రాడ ఈబీసీ కాలనీలో జనసేన నేతల తక్షణ చర్య

## వర్షపు నీరు నిలిచిన ప్రాంతాల్లో పర్యటన జేసీబీతో కాలువల్లో అడ్డంకుల తొలగింపు

## ప్రజలకు ఇబ్బందులు లేకుండా పరిస్థితులపై నిరంతర పర్యవేక్షణ





**పిఠాపురం (ప్రజా సీమ )**

తుఫాన్ ప్రభావంతో పిఠాపురం మండలం చిత్రాడ గ్రామంలోని ఈబీసీ కాలనీలోని కొన్ని ఇళ్లలోకి వర్షపు నీరు చేరడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం జనసేన పార్టీ నాయకుల దృష్టికి వచ్చింది. దీంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు పార్టీ నాయకులు కాలనీలో పర్యటించి పరిస్థితిని పరిశీలించారు.కాలనీలో వర్షపు నీరు సక్రమంగా వెళ్లేందుకు ప్రధాన కాలువల్లో పేరుకుపోయిన మట్టి, చెత్త తదితర అడ్డంకులను జేసీబీ సహాయంతో తొలగించారు. దీంతో నీటి ప్రవాహానికి మార్గం సుగమం చేసి, స్థానిక ప్రజలకు తక్షణ ఉపశమనం కల్పించే చర్యలు చేపట్టారు.తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన సహాయ చర్యలను కొనసాగిస్తామని జనసేన నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ పెంకే జగదీష్, పిఠాపురం మండలం జనసేన వైస్ ప్రెసిడెంట్ నిమ్మన దుర్గబాబు, చిత్రాడ గ్రామ జనసేన అధ్యక్షుడు నంద్యాల జాన్, వైస్ ఇన్‌చార్జ్ దేశరెడ్డి సతీష్, గ్రామ కమిటీ బూత్, వార్డు ఇన్‌చార్జులు గాది వెంకటేష్, కుక్కల శ్రీనివాస్, బస్వా గోపి, బావిశెట్టి నందీశ్వరరావు, కోలా శ్రీను, పాలూరి మణి, ప్రగాడ సాయి, సచివాలయం గ్రేడ్-5 సెక్రటరీ దుర్గాప్రసాద్, శానిటేషన్ ఇన్‌చార్జ్ నరేష్, ఫీల్డ్ అసిస్టెంట్ నాని, జనసేన నాయకులు, జనసైనికులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు



# బోయిన పల్లి లో జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం.

**రాజంపేట (ప్రజా సీమ):**

రాజంపేట మండలం కొత్త బోయినపల్లి పీఎం శ్రీ ఎస్ జె ఎస్ ఎస్ ఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యా యురాలు కే.భారతి,ఉపాధ్యాయులు యం. ఓబులేసు,వైద్య ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.కిశోర బాల బాలికలందరికీ నులిపురుగుల నివారణ మాత్రలు అందించారు ప్రధానోపాధ్యా యురాలు ఈ సందర్భంగా కే.భారతి మాట్లాడుతూ భారత దేశంలో ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 10 మరియు ఆగస్టు 10 తేదీలలో జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు ఓబులేసు మాట్లాడుతూ కేంద్ర ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పిల్లలలో పేగు సంబంధిత నులిపురుగుల ఇన్ఫెక్షన్లను అరికట్టడమే ధ్యేయంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు.



# నాణ్యమైన భోజనం అందించడమే ప్రధాన ఉద్దేశం

## - డిఆర్డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ రాజ్యలక్ష్మి

## - స్మార్ట్ కిచెన్ సెంటర్ ని పరిశీలన

**వేంపల్లె ప్రజాసీమ:**

ప్రభుత్వ విద్యా సంస్థల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం కింద విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడమే ఆ పథకం ప్రధాన ఉద్దేశమని డీఆర్డీఏ పీడీ, పులివెందుల నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ రాజ్యలక్ష్మి అన్నారు. శుక్రవారం స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల వద్ద ఉన్న డొక్కా సీతమ్మ స్మార్ట్ కిచెన్ సెంటర్ ని ఆమె పరిశీలించారు. అనంతరం స్మార్ట్ కిచెన్ లో తయారవుతున్న భోజనం పరిశుభ్రంగా, రుచికరంగా ఉందని సిబ్బందిని ప్రశంసించారు. విద్యార్థులకు సమయానికి భోజనం అందించాలని పలు సలహాలు సూచనలు చేశారు. అలాగే మండల వ్యాప్తంగా 18 పాఠశాలలకు 1958 మంది విద్యార్థులకు స్మార్ట్ కిచెన్ ద్వారా భోజనాలు అందిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పిఆర్ ఏఇ శ్రీనివాసులు, వెలుగు ఏపిఎం వెంకటేశ్వర రావు, మండల సమాఖ్య కార్యదర్శి షబ్రూన్, స్మార్ట్ కిచెన్ మేనేజర్ కవిత తదితరులు పాల్గొన్నారు.






# రాజంపేటలో డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం: స్పందించిన టీడీపీ సీనియర్ నాయకులు డాక్టర్ డి. నవీన్ కుమార్

**రాజంపేట (ప్రజా సీమ):**

రాజంపేట పట్టణంలో ప్రజలు ఎదుర్కొంటున్న తీవ్రమైన డ్రైనేజీ సమస్యకు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ డి.నవీన్ కుమార్ తక్షణ స్పందనతో పరిష్కారం లభించింది. పట్టణంలోని ఆర్ అండ్ బి బంగ్లా మరియు గ్రంథాలయం (లైబ్రరీ) ముందు భాగంలో డ్రైనేజీ కాల్వలు పూడిపోవడంతో మురుగునీరు రోడ్లపైకి ప్రవహించింది. దీనివల్ల ఇంజనీరింగ్ భవనాలు, ఇరిగేషన్ శాఖ కార్యాలయాలకు వెళ్లే ప్రజలు తీవ్ర దుర్వాసనతో ఇబ్బంది పడ్డారు. ముఖ్యంగా లైబ్రరీకి వచ్చే విద్యార్థులు మురుగునీటిని దాటుకుని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. అలాగే డ్రైనేజ్ పక్కనే ఉన్న పండ్ల వ్యాపారస్తులు, దోమల బెడద వల్ల ప్రజల ఆరోగ్యానికి హాని కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపాలిటీ అధికారుల ద్వారా పూడికతీత పనులుప్రజల ఇబ్బందిని గమనించిన డాక్టర్ డి. నవీన్ కుమార్ వెంటనే స్పందించి, మున్సిపాలిటీ అధికారుల సహకారంతో జెసిబి (జీజదీ) యంత్రాలను తెప్పించి కాల్వల్లోని పూడికను పూర్తిగా తొలగించారు. మురుగునీరు సక్రమంగా వెళ్లేలా చర్యలు చేపట్టి ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయించారూ. రాజంపేట పట్టణం పరిశుభ్రంగా ఉండాలనేదే నా ధ్యేయం," అని ఈ సందర్భంగా డాక్టర్ నవీన్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులుఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు టౌన్ ప్రెసిడెంట్ సుబ్రమణ్యం, ఐదుముల కుమార్, సంజీవ్ నాయుడు, కరీం,మనుబోలు వెంకటేష్, వెంకటేష్ నాయుడు, పిరు ఇతర పార్టీ నాయకులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



# పుంగునూరులో ప్రజా దర్బార్ నిర్వహించిన మధుసూదన్ నాయుడు!

**పుంగనూరు ప్రజాసీమ :**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజాదర్బార్ కార్యక్రమంలో భాగంగా పట్టణం లోని టిడిపి కార్యాలయం నందు శుక్రవారం ప్రజాదర్బార్ కార్యక్రమం నియోజకవర్గం టీడీపీ ఇంచార్జ్ మధు సూధన్ నాయుడు ఆధ్వర్యంలో జరిగింది . పట్టణం , మండలంలోని వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన ప్రజలు తమ సమస్యలను ఇంచార్జ్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి సమస్యను ఓపికగా విని, సంబంధిత అధికారులతో తక్షణమే మాట్లాడి సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మధుసూదన్ రాయల్,
దేశాధి ప్రకాష్ ,సుబ్రహ్మణ్యం రాజు, సమీపతి యాదవ్, సోమల సురేష్, , ఇబ్రహీం, బండ్లపల్లి బ్రదర్స్, ఆదినారాయణ, సుబ్రహ్మణ్యం, బాలాజీ, మోదుగులపల్లి మనోజ్ ,మోహన్ నాయుడు పెద్ద సంఖ్యలో నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# అంగన్వాడీ ఉత్సవాలలో పాల్గొన్న సి.డి.పి.ఒ. రేణుక





**పుల్లంపేట ప్రజాసీమ న్యూస్**

పుల్లంపేట మండలంలోని టీ బలిజపల్లి, టి. కమ్మపల్లి, వెంకటేశ్వరపురంఅంగన్వాడీ కేంద్రాలలో అంగన్వాడీ ఉత్సవాలనుజయప్రదంగానిర్వహించారుఈ ఉత్సవాలకు రైల్వే కోడూరు ఐ.సి.డి.ఎస్. ప్రాజెక్ట్ సి.డి.పి.ఒ. రేణుక హాజరైయ్యారు.ఈ సందర్భంగాప్రజాప్రతినిధులను, లబ్ధిదారులను మరియుతల్లులనుసమావేశపరచారు. అనంతరం సి.డి.పి.ఒ. రేణుక మాట్లాడుతూ, అంగన్వాడీ కేంద్రాలలో ఇస్తున్న పౌష్టిక ఆహారం, వాటి వినియోగం, వాటితో లభ్యమయ్యే పోషక విలువల గురించి వివరించారు .గర్భిణీలకు, బాలింతలకు మరియు 7 నెలల నుండి 3 సంవత్సరాల పిల్లలకు, అంగన్వాడీ కేంద్రానికి వచ్చు చిన్నారులకు మెను ప్రకారం భోజనం అందించాలని అన్నారు. ప్రతి నెలా పిల్లల బరువు తూచి, నమోదు చేసి అనుగుణంగా పోషకాలను అందించాలని తెలిపారు.ప్రతి ఒక్కరూ పోషక విలువలు ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవాలని తెలిపారు. ఈ అంగన్వాడీ ఉత్సవాలు ప్రతి అంగన్వాడీ కేంద్రంలో 3 రోజులు నిర్వహిస్తారని అన్నారు. కార్యక్రమంలో ఎం.ఇ.ఒ. చక్రధర్, సూపర్వైజర్ జయలక్ష్మమ్మ, ప్రధానోపాధ్యాయులు సయ్యద్, అంగన్వాడీ టీచర్లు లక్ష్మీదేవి, వెంకటసుబ్బమ్మ, శివమ్మ, హెల్పర్స్ మరియు గ్రామప్రజలు పాల్గొన్నారు.

# పుంగనూరు కోనేటికి పూర్వవైభవం తీసుకురావడమే లక్ష్యం

## - హైందవ సంస్కృతికి ప్రతీకగా నిలిచింది

## - ప్రజల దాహార్తిని తీర్చిన చరిత్ర ఈ కోనేరు సొంతం

## - విశ్రాంత డీఎస్పీ సుకుమార్ బాబు వెల్లడి

**మదనపల్లె (ప్రజా సీమ) :**

జమీందారుల కాలంలో నిర్మించి,ఉమ్మడి చిత్తూరు జిల్లాల్లోనే సుదీర్ఘ చరిత్ర కలిగిన పుంగనూరు కోనేటికి పూర్వవైభవం తీసుకొద్దామని విశ్రాంత డిఎస్పి, తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత కె.సుకుమార్ బాబు పేర్కొన్నారు.దశాబ్దాల చరిత్ర కలిగిన ఈ కోనేటిలోని బావి నుండి పుంగనూరు ప్రజలు తాగునీటిని తీసుకెళ్లేవారన్నారు.తాము చిన్నతనంలో సైతం ఆ కోనేరు నుండి నీటిని తీసుకొచ్చి తాగే వారమని గుర్తుచేసుకున్నారు. కొద్దిరోజుల క్రితం ఓ గుర్తు తెలియని వాహనం కోనేటి ప్రహరీ గోడను ఢీకొనడంతో గోడ దెబ్బతిందన్నారు.ఇది ఎంతో దురదృష్టకరమైన ఘటన అని ఆవేదన వ్యక్తం చేశారు.దీనిపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి సిసి కెమెరాలు ద్వారా కోనేటి ప్రహరీ గోడ ధ్వంసం కావడానికి కారణమైన డ్రైవర్,వాహనాన్ని కనుగొనే పనిలో నిమగ్నమయ్యారు. పూర్వం ప్రజలు స్వచ్ఛందంగా శుభ్రం చేయడం, పరిరక్షణకు కృషి చేయడం జరిగి ందన్నారు .కోనేటిలో నియమ,నిష్టలతో స్నానాలు ఆచరించి స్నానాలు ఆచరించే వారని,చుట్టూ అనేక ఆలయాలు ఉన్నాయని,ఇది భారతీయ సంస్కృతిని చాటి చెబుతుందన్నారు. ఇటువంటి పరిస్థితులలో పుర ప్రజలు,భక్తులు ఐకమత్యంతో కోనేటికి మరమ్మత్తులు చేయించి పూర్వవైభవం తీసుకురావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు.జమీందారీ వంశస్థులు ఇక్కడ నివసించడం,కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా ప్రసిద్ధిగాంచిన శ్రీ సుగుటూరు గంగమ్మ జాతరతో పుంగనూరు రాష్ట్రస్థాయిలో ప్రసిద్ధిగాంచిందన్నారు.ఈ ప్రాంతంలో వెలసిన ఆలయాలతోపాటు కోనేటిని కాపాడుకోవాల్సిన ఆవశ్యకత మనపై ఉందన్నారు.పుంగనూరు కోనేటిని తిరుమల తిరుపతి దేవస్థానానికి అప్పగిస్తే బ్రహ్మాండమైన అభివృద్ధి చెందుతుందని ,గత వైభవం సంతరించుకుంటుందని ఆయనతోపాటు,పలువురు పట్టణ ప్రజలు అభిప్రాయపడుతున్నారు.



# నులిపురుగులను తరిమికొడదాం.

## పిల్లల భవిష్యత్తును కాపాడుకుందాం:

## డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్. శేఖర్

## పుల్లంపేట మండలంలో 7,011 మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

## తొలిరోజే 98.36% లక్ష్య సాధన

## అక్టోబర్ 5న మిగిలిన 117 మందికి 'మాప్-అప్ డే' ద్వారా పంపిణీ





**పుల్లంపేట ప్రజాసీమ న్యూస్:**

జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా పుల్లంపేట మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్. శేఖర్, స్థానిక వైద్యాధికారి డాక్టర్ ఎస్. అశ్విని చంద్రల ప్రత్యక్ష పర్యవేక్షణలో స్థానిక ప్రాథమిక పాఠశాల వద్ద ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా డాక్టర్ శేఖర్ మాట్లాడుతూ.. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు మరియు అంగన్‌వాడీ కేంద్రాల్లోని 1 నుండి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలందరికీ ఆల్బెండజోల్ 400 ఎమ్జిమాత్రలను పంపిణీ చేసినట్లు తెలిపారు.తొలిరోజే విశేష స్పందన - 98% పైగా పూర్తయిన పంపిణీ:మండలంలో మొత్తం 7,128 మంది పిల్లలను లక్ష్యంగా నిర్దేశించుకోగా, మొదటి రోజు ఏకంగా 7,011 మందికి 98.36% అత్యంత విజయవంతంగా మాత్రలు పంపిణీ చేశారు.
ఆరోగ్యకరమైన ఎదుగుదలకు ఆల్బెండజోల్:పిల్లల్లో నులిపురుగుల కడుపులో పురుగులు వల్ల తీవ్ర రక్తహీనత, పోషకాహార లోపం, శారీరక-మానసిక ఎదుగుదల మందగించడం, చదువుపై ఏకాగ్రత తగ్గడం వంటి తీవ్ర సమస్యలు తలెత్తుతాయని డాక్టర్ శేఖర్ హెచ్చరించారు. పిల్లలు ఆరోగ్యంగా ఉంటేనే వారి భవిష్యత్తు బాగుంటుందని, ఉపాధ్యాయులు మరియు తల్లిదండ్రులు చొరవ తీసుకుని ప్రతి ఒక్క చిన్నారికి ఈ మాత్రలు అందేలా చూడాలని పిలుపునిచ్చారు.అక్టోబర్ 5న మాప్-అప్ డే గైర్హాజరు లేదా ఇతర కారణాల వల్ల ఈ రోజు మాత్రలు తీసుకోలేకపోయిన 117 మంది పిల్లల కోసం అక్టోబర్ 5న 'మాప్-అప్ డే' నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఆ రోజున మిగిలిపోయిన ప్రతి ఒక్కరికీ మాత్రలు అందించి, మండలంలో 100% లక్ష్యాన్ని సాధిస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ సూపర్వైజర్లు సుబ్బారెడ్డి, మహేష్; ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు నీలిమ, లక్ష్మీదేవి; ఆశా కార్యకర్త లక్ష్మి; అంగన్‌వాడీ కార్యకర్తలు లత, శ్రీలక్ష్మిలతో పాటు వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఐదు మద్యం దుకాణాలకు దరఖాస్తులు

## ఎక్సైజ్ సీఐ రాజశేఖర్

**సిద్దవటం ప్రజా సీమ**

సిద్దవటం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఐదు మద్యం దుకాణాల నిర్వహణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ రాజశేఖర్ తెలిపారు.శుక్రవారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. దరఖాస్తుదారులు ప్రభుత్వం నిర్ణయించిన రుసుమును చెల్లించి ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్ విధానంలోనూ దరఖాస్తులు సమర్పించవచ్చున్నారు. దరఖాస్తుల స్వీకరణకు అక్టోబర్ 1,2026 చివరి తేదీగా ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు.పూర్తి వివరాల కోసం సిద్దవటం ఎక్సైజ్ స్టేషన్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.



ప్రజాసీమ

# ఏఐ యుగంలో పరిశోధనా నైతికతపై మిట్స్ వర్సిటీలో అవగాహన

## - హాజరైన ఎన్ఐటికే సివిల్ ఇంజినీరింగ్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ కట్టా వెంకటరమణ





**మదనపల్లె (ప్రజా సీమ) :**

మదనపల్లె సమీపంలో గల (మదనపల్లె ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్) మిట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ నందు రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ విభాగం ఆధ్వర్యంలో అధ్యాపకులకు ఏఐ యుగంలో పరిశోధనా నైతికత - రీసెర్చ్ ఆర్టికల్ రిట్రాక్షన్ నివారణ అనే అంశంపై శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కర్ణాటక (ఎన్ఐటికే),సూరత్‌కల్ సివిల్ ఇంజినీరింగ్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ కట్టా వెంకటరమణ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృత్రిమ మేధ (ఏఐ) వినియోగం విస్తరిస్తున్న ప్రస్తుత కాలంలో పరిశోధనా నైతికత,పరిశోధనా సమగ్రత,పారదర్శకతకు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు.పరిశోధనలో తప్పుడు సమాచారం,ప్లాగరిజం వంటి అనైతిక పద్ధతులతో పాటు ఏఐ సాధనాలను తప్పుగా ఉపయోగించడం వల్ల పరిశోధన నాణ్యత,విశ్వసనీయత దెబ్బతింటాయన్నారు.ప్లాగరిజం అనేది ఇతరుల రచనలను కాపీ చేయడం మాత్రమే కాదని,ఇతరుల సమాచారాన్ని సొంత మాటల్లో రాసి సరైన ఆధారాలు పేర్కొంటూ ఏఐ సాధనాలను బాధ్యతగా ఉపయోగించడం ద్వారా పరిశోధనా నైతికతను కాపాడుకోవచ్చునన్నారు.పరిశోధనా వ్యాసం తయారీ నుంచి ప్రచురణ వరకు జరిగే వివిధ దశలను,వ్యాసాలు ఉపసంహరించ బడటానికి గల కారణాలను,అలాగే కమిటీ ఆన్ పబ్లికేషన్ ఎథిక్స్ మార్గదర్శకాలను ఆయన వివరించారు.శాస్త్రీయ రికార్డులో ఉన్న తప్పులను సరిదిద్దేందుకు పరిశోధనా వ్యాసం ఉపసంహరణ ఒక ముఖ్యమైన ప్రక్రియ అని తెలిపారు.ముఖ్యంగా పరిశోధనకు సంబంధించిన డేటా,రికార్డులు ,ఆధారాలను క్రమబద్ధంగా భద్రపరచుకోవాలని, భవిష్యత్తులో పరిశోధనకు సంబంధించిన ప్రశ్నలు,విచారణలు లేదా ఉపసంహరణకు సంబంధించిన అంశాలు తలెత్తినప్పుడు సరైన ఆధారాలతో స్పందించేందుకు ఇవి ఎంతో ఉపయోగపడతాయన్నారు.వైద్య మరియు ఇంజినీరింగ్ రంగాలకు సంబంధించిన పరిశోధనా వ్యాసాల ఉపసంహరణలపై పలు కేస్ స్టడీలను వివరించారు.పరిశోధనా వ్యాసాన్ని జర్నల్‌కు పంపే ముందు నైతిక ప్రమాణాలను సరిచూసుకునేందుకు ఉపయోగపడే పరిశోధన సక్రమంగా ఉందో లేదో చూసే జాబితాపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రామనాథన్, అసోసియేట్ డీన్-ఆర్ అండ్ డి డాక్టర్ పి.శివయ్య,విభాగాధిపతులు మరియు అధ్యాపకులు పాల్గొన్నారు.

# చిప్పిలి సమ్మర్ స్టోరేజీకి హంద్రీ-నీవా కంటితుడుపు చర్యే

## - నీటిని కుప్పానికి తరలించడమే కూటమి ప్రధాన ఉద్దేశ్యం

## - మదనపల్లె వైకాపా సమన్వయకర్త నిసార్ అహమ్మద్ విమర్శలు

## - వైసీపీ శ్రేణులతో కలిసి చిప్పిలి సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ పరిశీలన





**మదనపల్లె (ప్రజా సీమ) :**

హంద్రీ-నీవా కాలువ ద్వారా కృష్ణా జలాలు కుప్పం తరలించడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని,అన్నమయ్య జిల్లాలో చెరువులకు నీరు తూతుమంత్రంగా అందిస్తున్నారని,చిప్పిలి సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ కు నీరు కంటితుడుపు చర్యగా మదనపల్లె వైయస్సార్ సిపి సమన్వయకర్త ఎస్.నిసార్ అహమ్మద్ విమర్శించారు.శుక్రవారం మదనపల్లె మండలం చిప్పిలి సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును ఆయన వైయస్సార్సిపి నాయకులతో కలిసి పరిశీలించారు.సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ ను తగినంత నీటితో నింపకపోవడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.కాలువ నుంచి చెరువులోకి వచ్చే నీటి ప్రవాహం తక్కువ వుందని వారి పరిశీలనలో తేటతెల్లమైంది.ఈ సందర్భంగా నిసార్ అహమ్మద్ మాట్లాడుతూ కృష్ణా జలాలతో చెరువులు నింపుతున్నామని ఆర్భాటం చేస్తూ కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు.సిఎం చంద్రబాబునాయుడు నియోజకవర్గం కుప్పంకు నీరు తరలించడమే ప్రదాన అజెండా అని విమర్శలు గుప్పించారు .ప్రభుత్వం నీరు విడుదల చేసిన నాటి నుంచి నేటికీ మదనపల్లె చిప్పిలి సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ పూర్తిస్థాయి నీటితో కళకళలాడాలని,అలా కాకుండా కేవలం కొద్దిపాటి నీరవుందన్నారు.కేవలం మదనపల్లె ప్రజల కంటితుడుపు చర్యగా చిప్పిలి సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ కు నీరు విడుదల చేస్తున్నారన్నారు.తీవ్ర కరువు పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో హంద్రీ-నీవా కాలువ ద్వారా కృష్ణా జలాలు వస్తే చెరువులు నింపి తాగడానికి నీరు దొరుకుతుందని ప్రజలు సంతోషం వుంటే,కుప్పం తరలింపుకే అధిక ప్రధాన్యత ఇవ్వడంపై ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారన్నారు .కూటమి ప్రభుత్వం,సిఎం చంద్రబాబునాయుడు జిమ్మికులు తప్ప చిత్తశుద్ధితో ప్రజలకు మేలు చేయడం లేదని ఆరోపించారు.సిఎం మదనపల్లె పర్యటన వుంది కాబట్టి ఇప్పుడు చిప్పిలి సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నీటితో నింపాలని చూస్తున్నారని ఎద్దేవా చేశారు. తాత్కలిక ప్రాతిపదికన శాండ్ రింగ్ బండ్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.రింగ్ బండ్ ఏర్పాటు చేస్తే కనీసం 60 శాతం నీరు అయిన చెరువులో నిల్వ వుంటుందని అన్నారు.నీటి నిల్వలకు ప్రదానం ఇవ్వకుండా కేవలం పబ్లిసిటీ కోసం జలహారతులు ఇస్తున్నారని ఎద్దేవా చేశారు.కావాల్సింది జలహారతులు కాదని,నీటి నిల్వ చేసే సామర్థ్యం పెంచాలని సూచించారు.పుంగనూరు అభివృద్ధిపై దృష్టి సారించాలని కొత్తగా వచ్చిన టీడీపీ ఇన్‌చార్జ్ కు సూచించారు.కేవలం పెద్దాయన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి,ఎంపి మిథున్ రెడ్డిపైన విమర్శలు చెస్తే పదవి వుంటుందని విమర్శలు చేయడం నీ అజ్ఞానమన్నారు. ఇప్పటికైనా కూటమి నాయకులు నీటిని నింపి మదనపల్లె దాహార్తిని తీర్చాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వైసీపీ మేధావుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి విఎస్.రెడ్డి,డాక్టర్ అనిల్ కుమార్ రెడ్డి,మాజీ వైస్ ఎం పీపీ రమణ,సర్పంచులు వలసపల్లి నాగరాజ రెడ్డి,శరత్ రెడ్డి,పారేసి,శీలం రమేశ్,మాధవ రెడ్డి,సోషల్ మీడియా కార్యదర్శి సోమశేఖర్ రెడ్డి,సాంబశివా రెడ్డి,గ్రానైట్ మహేశ్, చిప్పిలి మల్లికార్జున రెడ్డి,బయ్యారెడ్డి, యూనస్,యాసిన్,బొమ్మిశెట్టి మధు, నాగిరెడ్డి ,ఆవుల విశ్వనాథ్,సుబ్రహ్మణ్యం, రాఘవేంద్ర,బాలాజీ నాయక్,షేక్ జబి,తాజ్ బాషా (క్వాలిటీ నట్స్),నరసింహులు,ముజీబ్,పూజారి చరణ్,మాలేపాడు చలపతి,గుడిటి చరణ్,అబ్దుల్లా,సాధిక్,సాయి కుమార్ తదితర నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# అంత్యోదయ స్ఫూర్తితోనే వికసిత భారత్ నిర్మాణం

## - సమాజంలోని చిట్టచివరి వ్యక్తికి సంక్షేమ పథకాలు అందించడమే అంత్యోదయ లక్ష్యం

## - బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్

**వేంపల్లె ప్రజాసీమ:**

జనసంఘ్ వ్యవస్థాపకుడు, బీజేపీ సిద్ధాంతకర్త పండిట్ దీనదయాల్ ఉపాధ్యాయ అందించిన అంత్యోదయ స్ఫూర్తితోనే వికసిత భారత్ నిర్మాణం సాధ్యమవుతుందని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి గాలి హరి ప్రసాద్ అన్నారు. దీనదయాల్ జయంతి సందర్భంగా శుక్రవారం స్థానిక పట్టణంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గాలి హరిప్రసాద్ మాట్లాడుతూ ఏకాత్మ మానవతావాద సిద్ధాంతాలను ప్రతిపాదించి దేశానికి ఎనలేని సేవలు చేసిన మహనీయుడు దీనదయాల్ ఉపాధ్యాయ అని కొనియాడారు. సమాజంలోని చిట్టచివరి వ్యక్తికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే అంత్యోదయ లక్ష్యమన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ అంత్యోదయ స్ఫూర్తితో సుపరిపాలన అందిస్తున్నారని తెలిపారు. సబ్ కా సాత్.. సబ్ కా వికాస్.. సబ్ కా విశ్వాస్.. సబ్ కా ప్రయాస్ స్ఫూర్తితో జీఎస్టీలో సంస్కరణలు చేపట్టి అన్ని



వర్గాలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు లక్ష్మిరెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పుష్పలత నాయక్, మండల అధ్యక్షుడు రంగారెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబోయిన రవియాదవ్, మునగల చంద్ర, ముద్ది శివకృష్ణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# పెద్దపల్లి గ్రామ పంచాయితీ అభివృద్ధికి కృషి చేస్తా

## మండల తాసిల్దార్ విజయ్ కుమార్

**సిద్ధవటం ప్రజా సీమ**

గ్రామంలో ఉన్న సమస్యలు పరిష్కారం చేస్తామని పెద్దపల్లి గ్రామపంచాయతీ స్పెషల్ ఆఫీసర్ మండల తాసిల్దార్ విజయ్ కుమార్ తెలిపారు మండలంలోని భాకరాపేట గ్రామ సచివాలయంలో శుక్రవారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ పెద్దపల్లి గ్రామపంచాయతీ లోని కడప- చెన్నై జాతీయ రహదారి సమీపాన ఉన్న డ్రైనేజీ, పలు రహదారుల్లో ఉన్న ముళ్ళ పొదలు పిచ్చి మొక్కలు తొలగిస్తామని, తెలిపారు ప్రజలకు త్రాగునీరు, విద్యుత్ దీపాలు వంటి ప్రధానమైన సమస్యలు పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు ఈ కార్యక్రమంలో ఇంచార్జి పంచాయతీ సెక్రెటరీ శ్రీనివాసులు, పాల్గొన్నారు



# అంగన్వాడీ కేంద్రాల్లో పోషణ మహ ఉత్సవాలు

## - ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఓ వి.సునిత

## - పోషకాహారం, ప్రీస్కూల్ ఎడ్యుకేషన్, పెరుగుదల పర్యవేక్షణ

**వేంపల్లె ప్రజాసీమ:**

అంగన్వాడీ కేంద్రాల్లో జాతీయ పోషణ మహ ఉత్సవాలతో పాటు మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆదేశాల మేరకు ప్రధాని నరేంద్ర మోడీ తన ప్రజాసేవ ద్వారా దేశసేవకు 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా సేవా సంకల్ప్ అభియాన్ నిర్వహిస్తున్నట్లు ఐసిడిఎస్ వేంపల్లె ప్రాజెక్ట్ సిడిపిఓ వి.సునిత అన్నారు. శుక్రవారం మండలంలోని బక్కనగారిపల్లి, స్థానిక గాండ్లవీధిలోని అంగన్వాడీ కేంద్రాల్లో పోషకాహారం, ప్రీస్కూల్ ఎడ్యుకేషన్, పెరుగుదల పర్యవేక్షణ తదితర సేవలు మరింత బలోపేతం చేసేందుకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం ద్వారా అందుతున్న పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని, లబ్ధిదారుల నుంచి వారి అనుభవాలను, పొందిన సేవలపై చర్చించారు. బిజెపి మహిళా మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుష్మా ఆధ్వర్యంలో నాయకులు ఈశ్వర్ రెడ్డి, సౌభాగ్య, దొంతు సుమన్, మాజీ ఎంపిటిసి సభ్యుడు మణిగోపాల్ రెడ్డి తదితరులు ఈ ఉత్సవాల్లో పాల్గొని పిల్లలకు బహుమతులు ప్రదానం చేశారు. అంతేకాకుండా ఉత్తమ సేవలు అందిస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులకు ఘనంగా సత్కరించారు.



# టిడిపి పార్టీలోకి చేరుతున్న యువత!

**పుంగనూరు మేజర్ న్యూస్:**

పట్టణంలోని టిడిపి కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గ ఇంచార్జ్ మధుసూదన్ నాయుడు ఆధ్వర్యంలో పట్టణంలోని యువత పార్టీ కండువా కప్పుకొని పార్టీలోకి చేరారు .ఈ సందర్భంగా ఇంచార్జ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై తెలుగుదేశం పార్టీలో చేరుతున్నారని వీరందరికీ పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని అన్నారు.



# అడవి ప్రాంతంలో వేటకు పాల్పడిన ముగ్గురు వ్యక్తుల అరెస్ట్ ,, కోర్టు రిమాండ్

**పజాసీమ:**

గిద్దలూరు డివిజన్, గుండ్లకమ్మ రేంజ్, రాచెర్ల సెక్షన్, అంబవరం బీట్, ఈ ఎన్ బి -x రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో చుక్కల దుప్పిని ఉచ్చులు బిగించి వేటాడిన కేసు లో గోగుల శ్రీను , భూపాని శ్రీ వెంకట లక్ష్మి నారాయణ, గుర్రం పెద్ద గురవయ్య అను ముగ్గురు నిందితులను అదుపులోనికి తీసుకోని కేసు నమోదు చేసి కోర్ట్ లో హాజరు పరచగ గిద్దలూరు మేజిస్ట్రేట్ వారు 14 రోజుల రిమాండ్ విధించారు. వీరిని ప్రకాశం జిల్లా, ఒంగోలు డిస్ట్రిక్ట్ జైలుకి తరలిచడం జరిగింది. చుక్కల దుప్పి వన్య ప్రాణుల రక్షణ చట్టం ప్రకారం అత్యంత రక్షణ జాబితాలో చేర్చబడినది. కావున వీటిని వేటాడం, చంపటం తీవ్ర నేరముగా పరిగనించబడుతుంది.



ప్రజాసీమ

# నియోజకవర్గంలో అభివృద్ధి వేగం పుంజుకోవాలి

## - ప్రజాసమస్యలపై అధికారులు దృష్టిసారించాలి

## - తంబళ్లపల్లి టిడిపి ఇంచార్జి జి.శంకర్ యాదవ్ సూచనలు

## - అంగళ్లు ప్రజా దర్బార్ కార్యక్రమానికి విశేష స్పందన





**కురబలకోట (ప్రజా సీమ) :**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజాదర్బార్ కార్యక్రమంలో భాగంగా తంబళ్లపల్లి నియోజకవర్గం, కురబలకోట మండలంలో శుక్రవారం నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమానికి తంబళ్లపల్లె నియోజకవర్గం టీడీపీ ఇంచార్జి,మాజీ ఎమ్మెల్యే శంకర్ యాదవ్ హాజరై ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన ప్రజలు తమ సమస్యలు,అభ్యర్థనలు, ఇబ్బందులను శంకర్ యాదవ్ దృష్టికి తీసుకువచ్చారు.ప్రజల ప్రతి సమస్యను ఓపికగా విని,సంబంధిత అధికారులతో తక్షణమే మాట్లాడి సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు.సమస్య అని వచ్చిన బాధితులకు భరోసా కల్పించారు.ప్రజల మధ్యకు వెళ్లి ప్రజల సమస్యలు విని పరిష్కారం కోసం అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చి ప్రతి ఒక్కరికీ అండగా నిలవడమే కూటమి ప్రభుత్వం ధ్యేయం,తమ ధ్యేయమని శంకర్ యాదవ్ తెలిపారు.కురబలకోట మండలంలోనే రెవిన్యూ సమస్యలు అధికంగా ఉన్నాయని అధికారుల నిర్లక్ష్య ధోరణి ఇందుకు కారణంగా తెలుస్తోందని అధికారులను హెచ్చరించారు.సమస్యల పరిస్కారంలో అలసత్వం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు.

**కార్యకర్తల సంక్షేమం,శ్రేయస్సుకు పెద్దపీట**

గత ప్రభుత్వ కాలంలో ప్రభుత్వ కార్యాలయాల మొఖమే చూడని కార్యకర్తలు ఉన్నారని,వారి సమస్యల పరిష్కారానికి అధికారులు తక్షణమే భాద్యత తీసుకోవాలని అధికారులకు సూచించారు.ప్రభుత్వం వచ్చి రెండు సంవత్సరాలు గడుస్తున్నా సమస్యల కోసం వచ్చే కార్యకర్తలను అధికారులు పట్టించుకో కపోవడం ఇందుకు నిదర్శనంగా ఉంటోందని ఆయన వెల్లడించారు.అన్నిశాఖల అధికారులు తమ కార్యకర్తలను పట్టించుకొని తమ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సూచించారు.నియోజకవర్గంలోని టిడిపి నాయకులు,కార్యకర్తలు సంక్షేమానికి పెద్దపీట వేస్తామన్నారు.వారికి ఆపద వచ్చినా అండగా ఉంటానని హామీ ఇచ్చారు.కూటమి పార్టీలతో సమిష్టిగా పనిచేసి రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రభంజనం సృష్టించాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ బీసీ సెల్ అధ్యక్షుడు సురేంద్ర యాదవ్,పార్లమెంట్ యువత కార్యదర్శి అయూబ్ బాషా,పార్లమెంట్ ఉపాధ్యక్షుడు పూసా మోహనరెడ్డి,మండలాధ్యక్షులు పాలగిరి సిద్ద,జిట్టా వెంకటరమణ,వై.జి సురేంద్ర యాదవ్,తెలుగు యువత రాజంపేట పార్లమెంట్ ఉపాధ్యక్షులు సుదర్శన్ రెడ్డి,మాజీ మండలాధ్యక్షుడు యల్లారెడ్డి,వై.జి రమణ,రుద్ర బాలకృష్ణ,అలం వలి మరియు అన్నిశాఖల అధికారులతోపాటు మండల టీడీపీ నాయకులు కార్యకర్తలు,కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# సచివాలయం ఉద్యోగులపై చిన్నచూపు తగదు

## - వారి న్యాయపరమైన సమస్యలను పరిష్కరించాలి

## - ఎంప్లాయిస్ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు గుడి నాగరాజు విజ్ఞప్తి

**మదనపల్లె (ప్రజా సీమ) :**

స్వర్ణ గ్రామం - స్వర్ణ వార్డ్ సచివాలయం ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని గ్రామ,వార్డ్ సచివాలయం ఎంప్లాయిస్ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు గుడి నాగరాజు కోరారు.సచివాలయం ఉద్యోగులతో కలిసి శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సచివాలయం ఉద్యోగులకు ప్రధాన సమస్యలైన రెండు నోషనల్ ఇంక్రిమెంట్స్,ప్రమోషన్ ఛానెల్,స్పష్టమైన జాబ్ చార్టులు ఇతర సమస్యలను త్వరగా పరిష్కారం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.సచివాలయం ఉద్యోగులకు సెలవులు మంజూరు చేయకుండా వేధిస్తున్న అధికారులపై చెర్యలు తీసుకోవాలని కోరారు.రాష్ట్ర వ్యాప్తంగా పై అధికారులు కొంతమంది సచివాలయం ఉద్యోగులకు సమయానికి ఇంక్రిమెంట్స్ మంజూరు చేయకుండా ఆలస్యం చేస్తున్నారని,అలాంటి వారిపై చెర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.అన్ని జిల్లాలో పూర్తిస్థాయి జీతాలు పెట్టకుండా కోతలు విధించి జీతాలు వేస్తున్నారని తెలిపారు.సచివాలయ ఉద్యోగుల సమస్యలను పరిష్కారం చేయకపోతే ఉద్యోగులంతా ఐక్యత చాటుకొని లక్షమందితో ఛలో విజయవాడ కార్యక్రమం చేపడతామని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో సచివాలయ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు,ఉద్యోగులు పాల్గొన్నారు.



# వినాయకుని లడ్డు ధర 300116 లు

## లడ్డు దక్కించుకున్న పోలంరెడ్డి కుటుంబ సభ్యులు,,

**పుల్లంపేట,(ప్రజా సీమ)**

పుల్లంపేట మండలం ఉడుము వారి పల్లి గ్రామంలో వినాయకుని లడ్డు వేలం పాట ధర రికార్డు స్థాయి పలికింది. గ్రామానికి చెందిన పోలంరెడ్డి నరసింహారెడ్డి, పోలంరెడ్డి సుధీర్ రెడ్డి మరియు వారి కుటుంబ సభ్యులు అక్షరాల 300116 రూపాయలకు పాడి స్వామివారి లడ్డును దక్కించుకున్నారు. ఉడుమువారి పల్లి గ్రామంలో వినాయక 'చవితి నిమజ్జనం పురస్కరించుకొని భారీ స్థాయి లో లడ్డు వేలం పాట పలకడం జరిగింది. లడ్డు వేలం పాటకు ఆశవహులు ప్రయత్నించగా చివరికి 3లక్షల116రూపాయలకు వినాయక లడ్డును కైసవం చేసుకోవడం జరిగింది. దేవుని ఆశీస్సులు వారి కుటుంబ సభ్యులకు ఎల్లవేళలా ఉండాలని గ్రామస్తులు కొనియాడారు.





# విశ్రాంత ఉద్యోగులకు పాత బకాయిలు వెంటనే జమచేయాలి

## - విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకుల విజ్ఞప్తి

**మదనపల్లె (ప్రజా సీమ) :**

పట్టణంలోని జిఆర్టి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ నందు శుక్రవారం ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఈ సమావేశానికి అధ్యక్షులు బివి రమణ,జనరల్ సెక్రెటరీ డాక్టర్ మునిగోపాలకృష్ణ, ట్రెజరర్ తిమ్మయ్య ,గౌరవ అధ్యక్షులు రెడ్డప్ప, అసోసియేట్ ప్రెసిడెంట్ శ్రీనివాసులు మరియు రాజన్న,సెక్రటరీ జగన్మోహన్ హాజరయ్యారు.ఈ సందర్భంగా డాక్టర్ ఎన్.మునిగోపాలకృష్ణ మాట్లాడుతూ సెప్టెంబర్ 1,2018 నుండి రావలసినటువంటి డియర్ నెస్ రిలీఫ్ బకాయిలు కొందరికి జమయ్యాయని మరికొందరికి ఇంకను జమ కాలేదన్నారు.జనవరి 14,2026వ తేదీన కొందరికి డియర్ నెస్ రిలీఫ్ బకాయిలు జమైందని,మరికొందరికి మే 30,2026వ తేదీన కొందరికి జమయ్యాయన్నారు. మదనపల్లిలో ఇంకను ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులకు జమ కాలేదని,కావున ముఖ్యమంత్రి చొరవ తీసుకుని బకాయిలను వెంటనే చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులకు డైరీలు కావలసినవారు వారి యూనిట్ అధ్యక్షులను జనరల్ సెక్రెటరీలను కలిసి వారి పేరు నమోదు చేసుకోవలెనన్నారు .ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల మంత్లీ మ్యాగజైనుకు సంవత్సర చందా,మూడు సంవత్సర ములకు చందా,ఆరు సంవత్సరములకు చందా,12 సంవత్సరములకు జీవిత చందా చెల్లించి సభ్యులుగా నమోదు చేసుకోవలెనన్నారు



.విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులకు ప్రభుత్వము ఉచిత వైద్య సౌకర్యము కల్పించింది.కానీ దంత వైద్యంలో ఒక దంతము ఇన్ ప్లాంట్ చేసుకోవడానికి రూ.26 వేలు ఖర్చు అవుతుందన్నారు.ఈ ఖర్చు కూడా ప్రభుత్వమే భరిస్తే వయోవృద్ధులైనటువంటి ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులకు సంతోషముగా ఉంటుందన్నారు.అలాగే ముఖ్యమంత్రి చొరవ చేసుకొని వయోవృద్ధులకు రైల్వే ప్రయాణంలో రైల్వే రాయితీని పునఃపరిశీలించాలని మన ఆంధ్రప్రదేశ్ ఎంపీల ద్వారా పార్లమెంటులో మన రాష్ట్ర గళం వినిపించాలని కోరుతున్నామన్నారు.

# వరద ప్రభావిత ప్రాంతాల్లో ఓదూరి కిషోర్ పర్యటన

## దెబ్బతిన్న పంటలను పరిశీలించి రైతులకు భరోసా

## రైతులకు అండగా జనసేన ప్రభుత్వం ఉంటుందని వెల్లడి





**పిఠాపురం:(ప్రజా సీమ )**

అర్నాబ్ తుఫాన్ ప్రభావంతో పిఠాపురం నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ముంపునకు గురైన పంట పొలాలను జనసేన పార్టీ ఫైవ్ మ్యాన్ కమిటీ సభ్యులు ఓదూరి కిషోర్ రెండో రోజు కూడా విస్తృతంగా పరిశీలించారు. రాయవరం, ఏకే మల్లవరం, లక్ష్మీపురం గ్రామాల్లో పర్యటించిన ఆయన నీట మునిగిన పంట పొలాలను పరిశీలించి, నష్టపోయిన రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఓదూరి కిషోర్ మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాల కారణంగా నష్టపోయిన రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జనసేన



ప్రభుత్వం, పార్టీ అన్ని విధాలా అండగా ఉంటాయని తెలిపారు. రైతుల సమస్యలను పరిష్కరించి వారికి న్యాయం జరిగేలా పిఠాపురం ఎమ్మెల్యే, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.రైతులు అధైర్యపడాల్సిన అవసరం లేదని, పంట నష్టంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న అన్నదాతలకు పార్టీ అండగా ఉంటుందని కిషోర్ భరోసా ఇచ్చారు. రైతు సంక్షేమమే జనసేన పార్టీ ప్రధాన లక్ష్యమని, తుఫాన్ ప్రభావం నుంచి రైతులు కోలుకునే వరకు వారికి అండగా నిలుస్తామని తెలిపారు.తుఫాన్, భారీ వర్షాల సమయంలోనూ ప్రజల మధ్య ఉంటూ వరద సహాయక చర్యలను పర్యవేక్షిస్తూ ఓదూరి కిషోర్ చేస్తున్న పర్యటనపై స్థానిక రైతులు, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ పర్యటనలో స్థానిక జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యార్థుల విజ్ఞప్తితో తుని-రాజమహేంద్రవరం మధ్య ప్రత్యేక బస్సు

**పిఠాపురం : (ప్రజా సీమ )**




విద్యార్థుల విజ్ఞప్తి మేరకు తుని--పిఠాపురం--రాజమహేంద్రవరం మధ్య నూతన బస్సు సర్వీస్‌ను ఏర్పాటు చేశారు. పిఠాపురం నియోజకవర్గ పర్యటన సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను విద్యార్థులు తమ ప్రయాణ ఇబ్బందులను వివరించి బస్సు సౌకర్యం కల్పించాలని కోరిన నేపథ్యంలో ఈ సర్వీస్‌ను అందుబాట ులోకి తీసుకు వస్తున్నారు. ఈ నూతన బస్సు సర్వీస్ సెప్టెంబర్ 26 నుంచి తుని డిపో ఆధ్వర్యంలో నడవనుంది. తుని నుంచి రాజమహేంద్రవరం వైపు ఉదయం 5.30 గంటలకు, మధ్యాహ్నం 2 గంటలకు బస్సులు బయలుదేరి పిఠాపురం మీదుగా రాజమహేంద్రవరం చేరుకుంటాయి. ఉదయం సర్వీస్ పిఠాపురానికి 7 గంటలకు, రాజమహేంద్రవరానికి 9 గంటలకు చేరుకోనుంది. మధ్యాహ్నం సర్వీస్ పిఠాపురానికి 3.30 గంటలకు, రాజమహేంద్రవరానికి సాయంత్రం 5.30 గంటలకు చేరుకుంటుంది.అదేవిధంగా రాజమహేంద్రవరం నుంచి తుని వైపు ఉదయం 9.30 గంటలకు, సాయంత్రం 6 గంటలకు బస్సులు బయలుదేరనున్నాయి. ఉదయం సర్వీస్ పిఠాపురానికి 11.30 గంటలకు, తునికి మధ్యాహ్నం 1.30 గంటలకు చేరుకోనుంది. సాయంత్రం సర్వీస్ పిఠాపురానికి రాత్రి 8.30 గంటలకు, తునికి రాత్రి 10.30 గంటలకు చేరుకుంటుంది.ఈ నూతన సర్వీస్‌తో విద్యార్థులు, ఉద్యోగులు, పిఠాపురం నియోజకవర్గ ప్రజలకు తుని, పిఠాపురం, రాజమహేంద్రవరం మధ్య ప్రయాణ సౌకర్యం మెరుగుపడనుంది. విద్యార్థుల అవసరాలను తెలుసుకుని వారి విజ్ఞప్తి మేరకు బస్సు సర్వీస్ ఏర్పాటు చేయడంపై విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

## ‘ఓజీ’పై విమర్శలు.. ఇకపై కథపై ఎక్కువ ఫోకస్ అంటూ దర్శకుడు సుజీత్ కీలక వ్యాఖ్యలు



పవర్ స్టార్ పవన్ కల్యాణ్ అభిమానులకు ‘ఓజీ’ సినిమా ప్రత్యేకమైన అనుభూతిని ఇచ్చింది. పవన్ కల్యాణ్‌ను స్టైలిష్, యాక్షన్ అవతార్‌లో చూడాలని చాలాకాలంగా ఎదురుచూస్తున్న అభిమానులకు దర్శకుడు సుజీత్ ఈ సినిమాతో మంచి ట్రీట్ ఇచ్చారు. పవన్ లుక్, యాక్షన్ సన్నివేశాలు, స్టైలిష్ ప్రజెంటేషన్ సినిమాపై భారీ అంచనాలు పెంచాయి. అయితే సినిమా విడుదలైన తర్వాత అభిమానుల స్పందనకు భిన్నంగా సాధారణ ప్రేక్షకుల నుంచి మిశ్రమ అభిప్రాయాలు కూడా వ్యక్తమయ్యాయి. ముఖ్యంగా సినిమాలో స్టైల్, హీరో ఎలివేషన్‌కు ఇచ్చిన ప్రాధాన్యతతో పోలిస్తే కథ, కథనం విషయంలో మరింత శ్రద్ధ పెట్టాల్సి ఉండేదనే విమర్శలు వచ్చాయి. సుజీత్ దర్శకత్వ శైలిపై కూడా సోషల్ మీడియాలో చర్చ జరిగింది. అయితే తాజాగా దర్శకుడు చేసిన ఓ వ్యాఖ్య ఈ విమర్శలకు ఆయన నుంచి వచ్చిన స్పందనగా మారింది.‘ఓజీ’ విడుదలై ఏడాది పూర్తయిన సందర్భంగా సుజీత్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. సినిమా విడుదలైన రోజున అభిమానుల్లో కనిపించిన ఉత్సాహాన్ని గుర్తు చేసుకుంటూ.. నటీనటులు, నిర్మాతలు, సాంకేతిక నిపుణులకు తన మద్దతు, కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన చేసిన మరో వ్యాఖ్య ఇప్పుడు సోషల్ మీడియాలో ప్రత్యేకంగా వైరల్ అవుతోంది. ప్రేక్షకుల నుంచి వచ్చిన అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని ఇకపై రచనపై మరింత దృష్టి పెడతానని సుజీత్ పేర్కొన్నారు. ముఖ్యంగా కథకు అవసరమైన సమయం, శ్రద్ధను కేటాయిస్తానని చెప్పడం ఆసక్తికరంగా మారింది. తన సినిమాల విషయంలో ప్రేక్షకుల అభిప్రాయాలను స్వీకరిస్తూ.తదుపరి రచనలో వాటిని పరిగణనలోకి తీసుకుంటాననే సంకేతాన్ని ఆయన ఇచ్చారు.సుజీత్ సినిమాలపై ఇప్పటివరకు వచ్చిన ప్రధాన విమర్శల్లో ఒకటి స్టైల్‌కు, కథకు మధ్య సమతుల్యతపై ఉండేది. విజువల్‌గా ఆకట్టుకునే సన్నివేశాలు, హీరో ఎలివేషన్స్, యాక్షన్‌కు ప్రాధాన్యత ఇచ్చే ఆయన శైలిపై ప్రశంసలతో పాటు విమర్శలు కూడా వచ్చాయి. ‘ఓజీ’ విషయంలోనూ ఇదే అంశంపై కొంతమంది ప్రేక్షకులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.అయితే తాజాగా సుజీత్ చేసిన వ్యాఖ్యలతో ఆయన తనపై వచ్చిన అభిప్రాయాలను సీరియస్‌గా తీసుకున్నారనే చర్చ మొదలైంది. ముఖ్యంగా కథను మరింత పకడ్బందీగా తీర్చిదిద్దేందుకు సమయం కేటాయిస్తానని చెప్పడం ఆయన తదుపరి సినిమాలపై ఆసక్తిని పెంచుతోంది.‘ఓజీ’తో పవన్ కల్యాణ్‌ను గ్యాంగ్‌స్టర్ తరహా స్టైలిష్ పాత్రలో చూపించిన సుజీత్.. తన తదుపరి ప్రాజెక్టుల్లో కథకు మరింత ప్రాధాన్యత ఇస్తారా? కథనం, పాత్రల భావోద్వేగాలు, యాక్షన్ మధ్య మరింత బ్యాలెన్స్ తీసుకొస్తారా? అనే చర్చ ఇప్పుడు మొదలైంది.మొత్తంగా ‘ఓజీ’పై వచ్చిన స్పందనను దృష్టిలో పెట్టుకుని తన రచనా విధానంపై మరింత దృష్టి పెడతానని సుజీత్ చెప్పడం ఆయన అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. సినిమా తర్వాత వచ్చే విమర్శలను స్వీకరించి తన తదుపరి కథలను మరింత జాగ్రత్తగా తీర్చిదిద్దాలనే ఆయన వ్యాఖ్య ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది.

## నవంబర్ 20న గ్రాండ్‌గా వస్తున్న ‘రాయవలస’.. రాధిక జయంతి దర్శకత్వంలో యాక్షన్ ధమాకా!

హీరోగా తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును తెచ్చుకునేందుకు సిద్ధమవుతున్న నూతన నటుడు కార్తిక్ జయంతి కథానాయకుడిగా పరిచయమవుతున్న తాజా చిత్రం “రాయవలస”. పూర్తిస్థాయి యాక్షన్, పవర్‌ఫుల్ ఎమోషన్స్ కలగలిపిన మాస్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమాకు రాధిక జయంతి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రొడక్షన్స్ పతాకంపై ప్రముఖ నిర్మాత గోపీ కృష్ణ జె ఈ చిత్రాన్ని అత్యంత భారీ నిర్మాణ విలువలతో నిర్మించారు. ఇప్పటికే ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా టీజర్‌కు విశేష స్పందన లభించడమే కాకుండా, చిత్రంపై భారీ అంచనాలను నెలకొల్పింది. డెబ్యూ నటుడైనప్పటికీ కార్తిక్ జయంతి తన ఇంటెన్స్ లుక్, పవర్‌ఫుల్ బాడీ లాంగ్వేజ్‌తో సినీ ప్రియులను ఎంతగానో ఆకట్టుకున్నారు.ఈ క్రమంలో మేకర్స్ తాజాగా ఈ చిత్ర విడుదల తేదీని అధికారికంగా ప్రకటిస్తూ పవర్‌ఫుల్ పోస్టర్‌ను విడుదల చేశారు. రాబోయే నవంబర్ 20వ తేదీన ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్లు నిర్మాతలు వెల్లడించారు. ఇక తాజాగా విడుదల చేసిన రిలీజ్ డేట్ పోస్టర్ సోషల్ మీడియాలో విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ పోస్టర్‌లో హీరో కార్తిక్ జయంతి చేతిలో త్రిశూలం పట్టుకుని, అమ్మవారి విగ్రహం ముందు అత్యంత పవర్‌ఫుల్ భావోద్వేగంతో నిలబడి ఉన్న తీరు సినిమాలోని యాక్షన్ డెప్త్‌ను, రౌద్రాన్ని ప్రతిబింబిస్తోంది.ఈ చిత్రంలో కార్తిక్ సరసన శ్రీష నులు కథానాయికగా నటిస్తుండగా, రాఖీ ఎ ఈ కథకు ఆకర్షణీయమైన మాటలు, కథనాన్ని అందించారు. సీనియర్ నటీనటులైన అన్నపూర్ణమ్మ, అనిత చౌదరి, జయప్రకాశ్, రవి వర్మ, కాశీ విశ్వనాథ్‌లతో పాటు ప్రముఖ నటులు త్రినాధ్ రావు, సుహాస్, కంచరపాలెం రాజు వంటి దిగ్గజ తారాగణం ఈ చిత్రంలో కీలక పాత్రల్లో కనిపించనున్నారు.ఈ సినిమాకు ప్రధాన బలంగా మ్యూజిక్ డైరెక్టర్ అర్జున్ బాలా స్వరపరిచిన సంగీతం నిలవనుంది. పూర్ణ చారి, కార్తిక్ జయంతి, తరుణ్ సైదులు రాసిన సాహిత్యాన్ని ప్రముఖ గాయకులు రాహుల్ సిప్లిగంజ్, ధనుంజయ్, రోహిత్ పరిటాల, రమ్య బెహరా, సాహితి చాగంటి, సౌజన్య భగవతుల, వాగ్దేవి, అర్జున్, మరియు కార్తిక్ జయంతి ఆలపించడం విశేషం. ఈ చిత్రానికి విఆర్‌కే నాయుడు (కిట్టు) ఛాయాగ్రహణం అందించగా, ప్రముఖ ఎడిటర్ గ్యారీ బిహెచ్ కూర్పు బాధ్యతలు నిర్వహించారు. మల్లేశ్ షాలియోన్ యాక్షన్ కొరియోగ్రఫీ, రాజ్ పైడే నృత్య రీతులు సమకూర్చగా, తేజస్వి సజ్జా పీఆర్వోగా వ్యవహరిస్తున్నారు. పక్కా యాక్షన్, మెలోడీ, భావోద్వేగాలు కలగలిపిన కంప్లీట్ మాస్ ఎంటర్‌టైనర్‌గా వస్తున్న ఈ చిత్రం నవంబర్ 20న ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుందని చిత్రబృందం ధీమా వ్యక్తం చేస్తోంది.




# అందం, టాలెంట్ ఉన్నా అదృష్టం కలిసిరావడం లేదు.. కాయాదు లోహర్‌కు వరుసగా మూడో షాక్?

చిత్ర పరిశ్రమలో అందం, అభినయం ఉన్నప్పటికీ సరైన విజయాలు దక్కాలంటే కొంత అదృష్టం కూడా కలిసి రావాల్సిందే. వరుసగా అవకాశాలు వస్తున్నా సినిమాలు ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోతే హీరోయిన్ల కెరీర్‌పై ఆ ప్రభావం పడుతుంది. ప్రస్తుతం యువ కథానాయిక కాయాదు లోహర్ కెరీర్ పరిస్థితి కూడా ఇలాంటి దశలోనే ఉందనే చర్చ టాలీవుడ్‌లో జరుగుతోంది. అస్సాంలో జన్మించిన కాయాదు లోహర్ పుణెలో చదువుకున్నారు. 2021లో విడుదలైన కన్నడ చిత్రం ‘ముగిల్‌పేట’తో హీరోయిన్‌గా వెండితెరకు పరిచయమైన ఆమె.. ఆ తర్వాత మలయాళంతో పాటు తెలుగు సినిమాల్లోనూ అవకాశాలు అందుకున్నారు. తెలుగులో శ్రీ విష్ణు హీరోగా నటించిన ‘అల్లూరి’ సినిమాతో టాలీవుడ్‌లోకి అడుగుపెట్టారు.అయితే భారీ అంచనాలతో వచ్చిన ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాన్ని అందుకోలేకపోయింది. సినిమాలో కయాదు తన అందం, నటనతో ఆకట్టుకున్నప్పటికీ.. ఆ సినిమా తర్వాత ఆమెకు వరుసగా పెద్ద అవకాశాలు దక్కలేదు. కొంత విరామం తర్వాత విశ్వక్ సేన్, అనుదీప్ కేవీ కాంబినేషన్‌లో వచ్చిన ‘ఫంకీ’లో నటించారు. ఇందులో సినీ నిర్మాణ కుటుంబానికి చెందిన యువతిగా, తండ్రి బాధ్యతలను తీసుకుని స్వయంగా సినిమా నిర్మాణంలోకి అడుగుపెట్టే పాత్రలో కనిపించారు. కథలో సినీ నేపథ్యం ఉండటంతో పాటు నటనకు అవకాశం ఉన్న పాత్ర అయినప్పటికీ.. ఆ సినిమా కూడా ప్రేక్షకులను ఆశించిన స్థాయిలో మెప్పించలేకపోయింది. దీంతో తెలుగులో కాయాదు నటించిన తొలి రెండు సినిమాలు బాక్సాఫీస్ వద్ద విజయాన్ని అందుకోలేకపోయాయి.అయితే ఆ పరాజయాలతో కయాదు వెనక్కి తగ్గలేదు. ఏకంగా నాని, శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో తెరకెక్కిన ‘ది ప్యారడైజ్’లో అవకాశం దక్కించుకున్నారు. దీంతో ఈ సినిమా తన కెరీర్‌కు మంచి మలుపు అవుతుందని అభిమానులు, సినీ వర్గాలు భావించాయి. కానీ సినిమా విడుదలైన తర్వాత ఆమె పాత్రపై మాత్రం భిన్నమైన చర్చ మొదలైంది. ‘ది ప్యారడైజ్’లో కాయాదు సుబ్బు అనే యువతి పాత్రలో కనిపించారు. సినిమాల్లో హీరోయిన్ కావాలనే కలతో మద్రాస్ వెళ్లే ఆమెకు ఆశించిన అవకాశాలు దక్కవు. మరోవైపు తండ్రి చేసిన అప్పుల కారణంగా కుటుంబం ఎదుర్కొంటున్న పరిస్థితులు ఆమె జీవితాన్ని మరో మలుపు తిప్పుతాయి. తండ్రి పరువు నిలబెట్టేందుకు డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో బీ గ్రేడ్ చిత్రాల్లో నటించే పరిస్థితికి ఆమె పాత్ర చేరుతుంది.అయితే ఈ పాత్రను తెరపై చూపించిన విధానంపైనే ప్రేక్షకుల నుంచి విమర్శలు వస్తున్నాయి. ముఖ్యంగా కొన్ని సన్నివేశాల్లో గ్లామర్‌ను ఎక్కువగా చూపించడం, తల్లి పాత్రతో కలిసి చిత్రీకరించిన సన్నివేశాలు, పాత్రలోని భావోద్వేగం కంటే కొన్ని వివాదాస్పద అంశాలే ఎక్కువగా చర్చకు రావడం వంటి విషయాలను నెటిజన్లు ప్రస్తావిస్తున్నారు. దీంతో కథలో కీలకమైన పాత్ర అయినప్పటికీ.. కాయాదు పాత్రకు ఆశించిన స్థాయిలో గుర్తింపు రాలేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సాధారణంగా సినిమా విజయం సాధించకపోయినా నటీనటుల పాత్రలకు మంచి పేరు వస్తే వారికి తదుపరి అవకాశాలు లభించే అవకాశం ఉంటుంది. కానీ ‘ది ప్యారడైజ్’ విషయంలో కాయాదు పాత్రపై ప్రశంసల కంటే విమర్శలే ఎక్కువగా కనిపించడం ఆమె అభిమానులను నిరాశకు గురిచేస్తోంది.ఇప్పటికే వరుసగా రెండు తెలుగు సినిమాలు ఆశించిన విజయాన్ని అందుకోకపోగా.. మూడో చిత్రంగా వచ్చిన ‘ది ప్యారడైజ్’లోనూ పాత్రపై విమర్శలు రావడంతో కయాదు తదుపరి అడుగులపై ఆసక్తి నెలకొంది. అందం, ప్రతిభ ఉన్న ఈ యువ కథానాయికకు సరైన కథ, బలమైన పాత్ర లభిస్తే తనను తాను నిరూపించుకునే అవకాశం ఉంటుంది. ఇకపై ఆమె ఎలాంటి కథలను ఎంచుకుంటారు? ఎలాంటి పాత్రలతో ప్రేక్షకుల ముందుకు వస్తారు? అనేది ఆమె కెరీర్‌లో కీలకంగా మారనుంది.



## ‘పార్కింగ్’ దర్శకుడితో శివకార్తికేయన్ కొత్త సినిమా.. పూజా కార్యక్రమాలతో లాంచ్!




కోలీవుడ్ టాలెంటెడ్ హీరో శివకార్తికేయన్ హీరోగా తెరకెక్కుతున్న తాజా సినిమా ‘ఎస్కే27’ అధికారికంగా ప్రారంభమైంది. ప్రముఖ నిర్మాణ సంస్థ సత్యజ్యోతి ఫిలింస్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. విమర్శకుల ప్రశంసలు పొందిన ‘పార్కింగ్’ చిత్రంతో జాతీయ అవార్డును గెలుచుకున్న టాలెంటెడ్ డైరెక్టర్ రామ్‌కుమార్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ప్రొడక్షన్ పనులు గ్రాండ్‌గా మొదలయ్యాయి.ఈ చిత్రంలో శివకార్తికేయన్ సరసన కయాదు లోహర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, యువ సంగీత సంచలనం సాయి అభ్యాంకర్ ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నట్లు సమాచారం. పర్ఫెక్ట్ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ ప్రాజెక్ట్‌పై కోలీవుడ్‌లో భారీ అంచనాలు నెలకొన్నాయి. శివకార్తికేయన్ తన తదుపరి సినిమాలతో పాటు ఈ ‘ఎస్కే27’ షూటింగ్ షెడ్యూల్స్‌ను కూడా బ్యాలెన్స్ చేయనున్నారు.

## మీ ప్రేమతో పాటు ట్రోల్స్‌ను ఎంజాయ్ చేస్తున్నా.. ‘ది ప్యారడైజ్’ సక్సెస్‌పై నాని ఎమోషనల్ పోస్ట్!



నేచురల్ స్టార్ నాని హీరోగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కిన ‘ది ప్యారడైజ్’ సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ విజయంతో దూసుకుపోతోంది. ఈ నేపథ్యంలో సినిమా విజయంపై, అలాగే సోషల్ మీడియాలో వస్తున్న ట్రోల్స్‌పై హీరో నాని స్వయంగా స్పందించారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా ఒక సుదీర్ఘమైన, ఎమోషనల్ నోట్‌ను షేర్ చేశారు.సినిమా చూసిన ప్రేక్షకుల స్పందనలు, రియాక్షన్స్ అన్నీ తాను చూశానని నాని తెలిపారు. ప్రేక్షకులు చూపించిన ప్రేమాభిమానాలతో పాటు, వారు చేసిన నవ్వులు పూయించే హిలేరియస్ ట్రోల్స్‌ను కూడా తాను ఎంతో ఆస్వాదించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సినిమాను ప్రేక్షకులు తమ సొంత చిత్రంగా ఓన్ చేసుకున్న తీరు తన మనసును తాకిందని, అలాగే క్రిటిక్స్ మరియు రివ్యూయర్స్ ఎత్తిచూపిన తప్పుల నుంచి తాను చాలా విషయాలు నేర్చుకున్నానని నాని నిజాయితీగా అంగీకరించారు.అన్నింటికీ ధన్యవాదాలు చెప్పడం ఒక్కటే నేను చేయగలిగిన పని. ప్రేక్షకులకు ఒక సరికొత్త అనుభూతిని పంచడం కోసం మేము ఎంతో కష్టపడి, చెమటోడ్చి ‘ది ప్యారడైజ్’ చిత్రాన్ని తెరకెక్కించాము. ఇప్పుడు ఈ సినిమాను సెలబ్రేట్ చేసుకోవడమో లేదా విమర్శించడమో పూర్తిగా మీ చేతుల్లోనే ఉంది. ఈ సినిమాపై మీరు చూపిన ఉత్సాహం, నాపై చూపిన ప్రేమ నన్ను కృతజ్ఞతాభావంతో నింపేశాయి అంటూ నాని తన భావాలను పంచుకున్నారు. ప్రస్తుతం నాని చేసిన ఈ పోస్ట్ నెట్టింట వైరల్ అవుతోంది.

## తెలుగులోకి ‘హనుమాన్ అన్శ్’.. త్రివిక్రమ్ తప్పుకోవడంతో ఇప్పుడు హోంబళే ఫిల్మ్స్ ఎంట్రీ?

హిందీ చిత్ర పరిశ్రమలో భక్తి ప్రధాన కథాంశంతో రూపొందిన కొన్ని సినిమాలు ఇటీవల భారీ విజయాలను అందుకుంటున్నాయి. అదే బాటలో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ‘హనుమాన్ అన్శ్’ కూడా మంచి ఆదరణను సొంతం చేసుకుంటూ వసూళ్ల పరంగా దూసుకెళ్తున్నట్లు సమాచారం. భక్తి, పురాణ నేపథ్య అంశాలను ఆసక్తికరంగా మేళవించిన ఈ సినిమాపై ఉత్తరాది ప్రేక్షకుల్లో మంచి స్పందన కనిపించడంతో.. ఇప్పుడు దక్షిణాది భాషల్లోనూ విడుదల చేసే ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా తెలుగు ప్రేక్షకులకు ఈ సినిమాను అందించేందుకు తొలుత ప్రముఖ దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ ముందుకు వచ్చినట్లు వార్తలు వచ్చాయి.సినిమాకు తెలుగు డబ్బింగ్ వెర్షన్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడంలో ఆయన భాగస్వామ్యం ఉండబోతుందని ప్రచారం జరిగింది. దీంతో తెలుగు ప్రేక్షకుల్లోనూ ఈ చిత్రంపై ఆసక్తి ఏర్పడింది. అయితే విడుదలకు కొన్ని రోజుల ముందు అనూహ్య పరిణామాలు చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. కొన్ని కారణాల వల్ల త్రివిక్రమ్ ఈ సినిమా తెలుగు విడుదల వ్యవహారం నుంచి తప్పుకున్నారని ప్రచారం మొదలైంది. దీంతో అసలు ‘హనుమాన్ అన్శ్’ తెలుగు ప్రేక్షకుల ముందుకు వస్తుందా లేదా అనే సందేహాలు కూడా వ్యక్తమయ్యాయి.ఇప్పుడు తాజాగా ఈ సినిమాకు సంబంధించి మరో ఆసక్తికరమైన వార్త సినీ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. దక్షిణాది ప్రేక్షకులకు సినిమాలను పరిచయం చేయడంలో ముందుండే ప్రముఖ నిర్మాణ సంస్థ హోంబళే ఫిల్మ్స్ ‘హనుమాన్ అన్శ్’ తెలుగు సహా దక్షిణాది భాషల విడుదల బాధ్యతలను తీసుకునేందుకు ఆసక్తి చూపిస్తున్నట్లు సమాచారం.అయితే దీనిపై ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. హోంబళే ఫిల్మ్స్ ఈ సినిమాను దక్షిణాదిలో విడుదల చేస్తుందనే వార్త ప్రస్తుతం పరిశ్రమ వర్గాల్లో వినిపిస్తున్న ప్రచారం మాత్రమే. సంస్థ నుంచి అధికారికంగా ప్రకటన వచ్చిన తర్వాతే దీనిపై పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉంది. హోంబళే ఫిల్మ్స్‌కు భక్తి చిత్రాల విషయంలో ఇప్పటికే అనుభవం ఉంది. ఇటీవల హిందీ నుంచి వచ్చిన ‘మహావతార్ నరసింహ’ చిత్రాన్ని కూడా దక్షిణాది ప్రేక్షకులకు చేరువ చేయడంలో సంస్థ కీలకంగా వ్యవహరించింది. ఆ సినిమా కూడా పురాణ, భక్తి నేపథ్యంతో తెరకెక్కినదే కావడంతో.. ఇప్పుడు ‘హనుమాన్ అన్శ్’ విషయంలోనూ ఇదే సంస్థ పేరు వినిపించడం ఆసక్తిని పెంచుతోంది. ఒకవేళ హోంబళే ఫిల్మ్స్ ఈ చిత్రాన్ని అధికారికంగా తీసుకుంటే.. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల చేసే అవకాశాలు ఉండొచ్చనే చర్చ జరుగుతోంది. ఇప్పటికే హిందీలో ప్రేక్షకుల నుంచి వచ్చిన స్పందన దక్షిణాదిలోనూ సినిమాకు ఉపయోగపడుతుందనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి.




Published BY B Ramasubba Reddy, PRINTED AT VSAR PUBLICATIONS, DOOR NO. 41/1077, SANKARAPURAM, KADAPA, YSR Kadapa District, ANDHRA PRADESH-516002, PUBLISHED AT 41/1077, SANKARAPURAM, KADAPA, YSR Kadapa District, ANDHRA PRADESH-516002 EDITOR: B Ramasubba Reddy, RNI NO: APTEL/26/A0819, Cell: 9515583664 Email: svscollegerjpt@gmail.com. Owner: Vasantha Lakshmi Narasamma